మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 113 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad

బుధవారం 24 జూలై 2024



# కక్షపూరిత వివక్ష

- ఎన్డీయే అంటే నితీశ్,నాయుడు అలయన్స్
- ఎన్డీయేకు రేవంత్ కొత్త జోస్యం
- తెలంగాణపై వివక్షపై అసెంబ్లీలో తీర్మానం చేస్తాం
- పలుమార్లు ప్రధానికి కలిసి కోరినా ఫలితం సున్నా
- తెలంగాణపై కక్షను మరోసారి బయటపెట్టిన మోడీ
- పోలవరం కోసం నిధులు ఇచ్చి...పాలమూరుకు ఇవ్వరా!
- విభజన చట్టంలో తెలంగాణకు ఎందుకీ అన్యాయం?
- పార్లమెంటులో మా ఎంపీలతో నిరసన తెలియచేస్తాం
- కిషన్‌రెడ్డి రాజీనామా చేసి నిజాయితీ నిరూపించుకోవాలి
- బడ్జెట్ కేటాయింపులపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు

హైదరాబాద్, (ప్రజా మంటలు): కేంద్రం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ 2047 బడ్జెట్‌లో తెలంగాణ పట్ల వివక్ష తో పాటు కక్షను కూడా ప్రదర్శించారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో ఎప్పుడూ ఇంతగా దగా జరగలేదన్నారు. తాము పలుమార్లు ప్రధానిని, కేంద్రమంత్రులను కలసి విన్నవించినా..ప్రధాని మోడీ పెద్దన్నగా అండగా ఉండాలని కోరినా తీవ్ర నిర్లక్ష్యం చూపారని మండిపడ్డారు. దీనిపై రేపటి శాసనసభలో కేంద్రానికి వ్యతిరేకంగా తీర్మానం చేస్తామని అన్నారు. అలాగే తమ నిరసనలు కొనసాగిస్తా మని అన్నారు. 8 సీట్లు ఇచ్చిన తెలంగాణ ప్రజల పట్ల మోడీ కక్ష సాధింపు చర్యలకు దిగారని,

మిగతా 2లో..



# బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి

## - ఏపీ,బీహార్‌కు బడ్జెట్‌లో పెద్దపీట

- 9 ప్రాధాన్య అంశాల ఆధారంగా బడ్జెట్
- వ్యవసాయరంగానికి పెద్దపీట వేస్తూ నిర్ణయం
- నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనపై దృష్టి
- స్థూలంగా బడ్జెట్ పరిమాణం రూ.48.21 కోట్లు
- మొత్తం ఆదాయం రూ.32.07 లక్షల కోట్లు
- పన్ను ఆదాయంఅంచనా రూ.28.83 లక్షల కోట్లు
- ద్రవ్యలోటు 4.9 శాతంగా ఉండవచ్చని అంచనా
- అప్పులు, పన్నేతర ఆదాయాలు రూ.16 లక్షల కోట్లు
- అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు కేటాయింపు
- బీహార్‌లో మౌళిక వసతుల కల్పనలకు భారీగా కేటాయింపులు
- బంగారం, ఫోన్స్ యాక్సరీస్‌పై సుంకాలు తగ్గింపు






**ధరలు తగ్గేవి..**
మూడు రకాల క్యాన్సర్ మందులు,మొబైల్ ఫోన్లు, ఛార్జర్లు, దిగుమతి చేసిన బంగారం, వెండి,లెదర్ గూడ్స్ సీఫుడ్, రొయ్యలు, ఫిష్ ఫీడ్, ఎక్స్ రే ట్యూబ్‌లు,ఉక్కు, రాగి సోలార్ సెల్స్-ప్యానల్ల తయారీకి అవసరమైన వస్తువులు, 25 రకాల క్రిటికల్ మినరల్స్,బ్రూడ్‌స్టాక్, పాలీచేటి వార్మ్స్, ష్రింప్, మిథైలిన్ డైఫినైల్ డిస్సోసియనేట్ (ఎండీఐ)


**పెరిగేవి..**
ప్లాస్టిక్ ఐటమ్‌లు, పీవీసీ ఫ్లెక్స్ బ్యానర్లు, సోలార్ గ్లాస్, టిన్ కాపర్ ఇంటర్‌కనెక్ట్,అమ్మోనియం నైట్రేట్

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): కొన్ని మెరుపులు.. మరికొన్ని విరుపులు.. కొన్ని ఆశలు..మరికొన్ని ఆకాంక్షలతో ఎప్పటిలాగే ఉద్యోగుల ఇన్‌కమ్ ట్యాక్స్‌పై పెద్దగా సడలింపులు లేకుండా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశ పెట్టారు. కేంద్ర ప్రభుత్వం 9 ప్రాధాన్య అంశాల ఆధారంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఆర్థిక వ్యవస్థలో అవకాశాలను సృష్టించడమే లక్ష్యంగా ప్రాధాన్య అంశాలను ఎంపిక చేసుకుంది.

మిగతా 2లో..

# అన్ని వర్గాలకు మేలు చేకూర్చేలా బడ్జెట్

## రైతులు, పేదలను ఆదుకునేలా ప్రతిపాదనలు - ప్రధాని మోడీ ప్రశంసలు



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ 2024-25 పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. సీతారామన్ పద్దుపై ప్రశంసలు కురిపించారు. మధ్యతరగతి ప్రజలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు స్పష్టం చేశారు. రైతులు, పేదలను దృష్టిలో పెట్టుకుని నిర్మలా సీతారామన్ ఈ పద్దుని రూపొందించారని వెల్లడించారు. ఈ పద్దుతో యువతకు భారీ స్థాయిలో ఉద్యో గావకాశాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. గత పదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయట పడ్డారని, మధ్య తరగతి వర్గం సాధికారత సాధించే విధంగా ఈ బడ్జెట్ ఉందని తెలిపారు. విద్యారంగం తో పాటు నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెట్టినట్టు స్పష్టం చేశారు. ఉద్యోగాల కల్పనలో భాగంగా ఎంఎలాయ్‌మెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్‌ని తీసుకురావడం చాలా గొప్ప విషయమని అన్నారు.



రాష్ట్రాలే రాజ్యాలు
విభిన్నాల వేలికలో ,
ఎదురుచెప్పే నాదుడెవరు
ప్రజాస్వామ్య కంచెలో !

ఎవరికి వారే దిట్ట అనుకునే
ముసుగులో మహా మునులు,
సమన్వయ సహకారం లేని
శాంతియుత బోధనలు!

-న్యాలకంటి నారాయణ
9346200066

# కుర్చీని కాపాడుకొనే బడ్జెట్

- మిత్రపక్షాల బడ్జెట్ - ప్రతిపాదనలపై కాంగ్రెస్ పెదవి విరుపు
- కాపీ పేస్ట్ బడ్జెట్ అంటూ విమర్శలు
- కాంగ్రెస్ నేతలు రాహుల్, ఖర్గే తదితరుల విమర్శలు



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ నిప్పులు చెరిగారు. ఇది కుర్చీని కాపాడుకునే బడ్జెట్ అని దుయ్యబట్టారు. ఈబడ్జెట్ తన మిత్రపక్షాలను సంతోషపెట్టేలా ఉందని ఆరోపించారు. ఇతర రాష్ట్రాలను పణంగా పెట్టి.. బడ్జెట్‌లో తమ మిత్రపక్షాలకు బూటకపు వాగ్దానాలు చేశారని మండిపడ్డారు. తన స్నేహితులను సంతోషపెట్టడం కోసమే ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారని.. దీని నుంచి అదానీ, అంబానీ ప్రయోజనం పొందుతారని పేర్కొన్నారు. ఎప్పట్లాగే ఈసారి కూడా సామాన్య భారతీయుడికి ఎలాంటి ఉపశమనం లభించలేదని చెప్పారు. ఇదొక కాపీ పేస్ట్ బడ్జెట్ అని.. కాంగ్రెస్ మేనిఫెస్టో, గత బడ్జెట్‌లను కాపీ కొట్టారని ఎక్స్ వేదికగా ఆయన విమర్శించారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సైతం విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీ తరహాలోనే.. దీనిని ఓ కాపీ పేస్ట్ బడ్జెట్‌గా అభివర్ణించారు. ఈ మోదీ ప్రభుత్వ కాపీక్యాట్ బడ్జెట్.. కాంగ్రెస్ న్యాయ అజెండాను కూడా సరిగ్గా కాపీ చేయలేకపోయిందని ఖర్గే వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. కూటమి భాగస్వాములను మోసం చేసేందుకు, ఎన్డీఏ మనుగడ సాగిచేందుకు మోదీ ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో అరకొర డబ్బులు పంచుతోందని ఆరోపించింది. ఇది దేశ ప్రగతికి ఉద్దేశించిన బడ్జెట్ కాదని.. మోదీ ప్రభుత్వాన్ని కాపాడే బడ్జెట్ అని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. మరో కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం కూడా ఇదొక కాపీక్యాట్ బ్జడెట్ అని పేర్కొన్నారు. బడ్జెట్ ప్రసంగంలో భాగంగా కాంగ్రెస్ మేనిఫెస్టోని చదివినందుకు నిర్మలా సీతారామన్‌కు ధన్యవాదాలను సెటైరికల్ కామెంట్ చేశారు. అప్రెంటిస్‌షిప్ పథకాన్ని కూడా కాంగ్రెస్ మేనిఫెస్టోలోని 11వ పేజీ నుంచి తీసుకున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలోని అంశాలని బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం కాపీ కొట్టిందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే,

మిగతా 2లో..

# రాజకీయ కక్షతోనే కవితను జైల్లో పెట్టారు

- కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై పట్టు సాధించలేకపోయింది
- బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో కేసీఆర్



హైదరాబాద్, (ప్రజా మంటలు): తాను అగ్నిపర్వతంలా ఉన్నానని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ ఎల్పీ సమావేశమైంది. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్సీలకు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు, బడ్జెట్ నేపథ్యంలో శాసనభలో అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. మండలిలో బీఆర్ఎస్ పక్షనేతగా మధుసూదనాచారిని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ కక్షతోనే

మిగతా 2లో..

## ప్రజా నాడి



# వరద గోదావరి

- ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- శ్రీరాంసాగర్‌కు జలకళ
- ప్రాజెక్టులోకి భారీగా వచ్చి చేరుతున్న వరదనీరు



రాజమహేంద్రవరం,నిజామాబాద్ (ప్రజా మంటలు): భారీ వర్షాలతో గోదావరి ఉగ్రరూపం దాలుస్తోంది. వరద పోటెత్తడంతో ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 14.10 అడుగులకు చేరింది.సముద్రంలోకి 13.23లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మరోవైపు గోదావరి వరదతో కోనసీమ పరిధిలోని పలు లంక గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. కొన్ని చోట్ల ఉద్యాన పంటలు, కాజ్‌వేలు మునిగిపోయాయి. పి.గన్నవరం, అయినవిల్లి మండలాలకు చెందిన లంక గ్రామాల ప్రజలు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు.

**శ్రీరాంసాగర్‌కు జలకళ**

శ్రీరాంసాగర్ జలకళ సంతరించుకుంది. ఎగువ నుంచి వస్తున్న వరదతో ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఎగువ మహారాష్ట్ర, గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు భారీ వరద పోటెత్తింది. ఎగువ నుంచి 21,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా ఔట్ ఎ÷-లో 532క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 1069.50 అడుగులు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం.90.31 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 22.436 టీఎంసీలుగా ఉంది. అలాగే కామారెడ్డి జిల్లాలోని

మిగతా 3లో..

# 31 వరకు అసెంబ్లీ

- 25వ తేదీన బడ్జెట్ ప్రవేశపెట్టనున్న భట్టి
- బీఏసీ సమావేశంలో సమావేశాల ఎజెండా ఖరారు

హైదరాబాద్, (ప్రజా మంటలు): ఈ నెల 31వ తేదీ వరకు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. 25వ తేదీన బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. 26, 28 తేదీల్లో అసెంబ్లీకి సెలవు ప్రకటించారు. 31వ తేదీన ద్రవ్య వినిమయ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలుపనుంది. బుధవారం పంటల రుణమాఫీపై చర్చ జరగనున్నట్లు సమాచారం. అలాగే జాబ్యాలెండర్‌పైనా కూడా చర్చ జరుగనుంది. బీఏసీ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్‌లు, బీఆర్ఎస్ నుంచి హరీశ్‌రావు, ప్రశాంత్ రెడ్డి, బీజేపీ నుంచి మహేశ్వర్ రెడ్డి, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు, ఎంఐఎం నుంచి బలాల హాజరయ్యారు. కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతిపట్ల శాసనసభ ఇవాళ సంతాపం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆమె మృతికి సంతాపంగా సభ్యులందరూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం సభను బుధవారం ఉదయం 10 గంటలకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

మొదటి పేజీ తరువాయి

## అన్ని వర్గాలకు మేలు చేకూర్చేలా బడ్జెట్

'గత పదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. ఈ సారి బ్జడెట్ పూర్తిగా మధ్యతరగతి వర్గానికి మేలు చేసే విధంగా ఉంది. విద్య, నైపుణ్యాభివృద్ధిపై బడ్జెట్లో ప్రాధాన్యత దక్కింది. మహిళలు, వ్యాపారులు, ఓ÷ూఓఇలకూ ఊతం అందించే పద్దు ఇది. యువతకు మేలు చేసే విధంగా ప్రత్యేకంగా ఇన్సెంటివ్ స్కీమ్‌ని తీసుకురావడం చాలా గొప్ప విషయం అని అన్నారు. యువత కోసం ప్రత్యేకంగా రూపొందించిన స్కీమ్‌తో లబ్ది చేకూరుతుందని ప్రధాని వెల్లడించారు. ఈ పథకంలో భాగంగా కొత్తగా ఉద్యోగంలో చేరిన వాళ్లకి ఓ నెల జీతం అడ్వాన్స్‌గా ఇస్తారు. అయితే..ఈ డబ్బుని ఖఈ లో జమ చేస్తారు. రూ.లక్షలోపు జీతం ఉన్న వాళ్లు ఈ స్కీమ్‌కి అర్హులుగా కేంద్రం ప్రకటించింది. దీంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత దేశంలోని బడా సంస్థల్లో పని చేసే విధంగా ఈ స్కీమ్ ప్రోత్సహించనుంది. మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తరవాత ప్రవేశపెట్టిన తొలి బ్జడెట్ ఇది. ఈ పద్దుపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే...ఐటీ శ్లాబ్‌ల విషయంలో మాత్రం పెద్దగా ఊరట ఏమీ దక్కలేదు.

## కుర్చీని కాపాడుకొనే బడ్జెట్

ఆ పార్టీ సీనియర్ నేతలు శశిథరూర్, పి.చిదంబరం అన్నారు. తమ మేనిఫెస్టో నుంచి నిర్మలా సీతారామన్ 'అప్రంటీస్ స్కీమ్'ను కాపీ కొట్టారని మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. నిర్మలా సీతారామన్ 'ఇంటెర్న్‌షిప్ స్కీమ్'ను ప్రకటించారు. ఈ స్కీమ్ కింద ఫార్మల్ సెక్టార్‌లో ఫస్ట్‌టైమ్ ఉద్యోగులకు ఒక నెల వేతనం లభిస్తుంది. ఉద్యోగాన్వేషణలో ఉన్న వారు 500 టాప్-కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేయవచ్చు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టే-2024ను ఆర్థిక మంత్రి చదివారని, అందుకు ఆమెను అభినందిస్తున్నానని పి.చిదంబరం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలోని 30వ పేజీలో పేర్కొన్న ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ (ఇఒఎ)ను నిర్మలా సీతారామన్ బ్జడెట్‌లో చేర్చడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో పేజ్-11లో చెప్పిన 'ఎంప్రటీస్ స్కీమ్'ను కూడా ఆర్థిక మంత్రి బ్జడెట్‌లో ప్రవేశపెట్టారని చెప్పారు. కాంగ్రెస్ మరికొన్ని ఐడియాలను కూడా బ్జడె?ట్‌లో చేర్చారని ఆయన తెలిపారు. అయితే బ్జడెట్‌లో 'ఏంజెల్ టాక్స్'ను నిర్మలా సీతారామన్ రద్దు చేయడాన్ని ఆయన అభినందించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఏళ్లుగా 'ఏంజెల్ టాక్స్'ను రద్దు చేయాలని కోరుతోందని, కాంగ్రెస్ మేనిఫెస్టో 31వ పేజీలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఇదని చెప్పారు. కాగా, సామాన్య ప్రజానీకం సమస్యలపై బ్జడెట్‌లో పరిష్కారం కనిపించలేదని శశిథరూర్ పేర్కొన్నారు. ఎంఎన్ఆర్ఈజీఏ ఊసే లేదన్నారు. ఆదాయ అసమానతల పరిష్కారానికి బ్జడెట్‌లో చేసింది కూడా చాలా తక్కువ అని అన్నారు. ఏంజెల్ ఇన్వెస్టర్లపై పన్ను రద్దు చేయడాన్ని మాత్రం తాము స్వాగతిస్తున్నట్టు చెప్పారు.

## వరద గోదావరి

నిజాంసాగర్ ప్రాజెక్టుకు వరద స్వల్పంగా మొదలైందని అధికారులు తెలిపారు. ఇన్ ఎ÷-లో 715 క్యూసెక్కులు వచ్చి చేరుతున్నది. 17 టీఎంసీల నీటి సామర్థ్యానికి ప్రస్తుతం మూడు టీఎంసీలుగా ఉంది. ఇక శ్రీశైలం జలాశయానికి 1,73,504 క్యూసెక్కుల వరద వస్తున్నది. 1,21,171 క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 255 మీటర్ల వద్ద నీటిమట్టం ఉండగా, 58.59 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

## రాజకీయ కక్షతోనే కవితను జైల్లో పెట్టారు

నా కుమార్తెను జైలులోపెట్టారట్టాని ఆరోపించారు.సొంత బిడ్డ జైలులో ఉంటే కన్నతండ్రిగా బాధ ఉండదా? అంటూ ప్రశ్నించారు. క్లిష్ట పరిస్థితులు ఏమీ లేని.. ఇంతకంటే ఇబ్బందికర పరిస్థితుల్లో తెలంగాణను సాధించామని స్పష్టం చేశారు. నలుగురు ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ అధికారంలోకి రాలేదా? అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ఎమ్మెల్యే బాగా ఎదుగుతారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టు సాధించలేకపోయిందని.. పాలనపై దృష్టి పెట్టకుండా అభాసుపాలు చేసే పనిలోనే ఉన్నారని విమర్శించారు. శాంతిభద్రతలు ఎందుకు అదుపుతప్పుతున్నాయని నిలదీశారు. ఎక్కడో ఉన్న వారిని నేతలను చేస్తే పదవులు వచ్చాక పార్టీని వీడుతున్నారని.. పార్టీ వదిలి వెళ్లేవారిని గురించి ఆలోచించాల్సిన అవసరం లేదని కేసీఆర్ స్పష్టం చేశారు. శాంతి భద్రతలు ఎందుకు అదుపుతప్పుతాయి? ఎక్కడో ఉన్న వారిని నేతలను చేస్తే.. పదవులు వచ్చాక పార్టీని వీడుతున్నారు. పార్టీ వదిలి వెళ్లే వారి గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు"అని పార్టీ ఎమ్మెల్యేలతో కేసీఆర్ అన్నట్టు సమాచారం. శాసనమండలిలో భారాస పక్ష నేతగా మధుసూదనాచారిని ప్రకటించారు.

# బడ్జెట్‌పై నిలదీద్దాం

**- పార్లమెంట్‌లో నిరసనకు విపకాలు రెడీ..**

**- ఈ మేరకు కూటమి నేత సమావేశం**

దిల్లీ (ప్రజా మంటలు):

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే కూటమి నేతలంతా కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్ పవార్, సంజయ్ రౌత్ తదితరులు హాజరయ్యారు.కేంద్ర మంత్రుల వేతనాలు, అతిథుల ఆతిథ్యానికి రూ.1,248.91 కోట్లు..బడ్జెట్‌పై విపక్ష నేతలు చర్చించారు. దీనికి వ్యతిరేకంగా నిరసన తెలిపాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ వెల్లడించారు. "భాజపా అధికారంలో లేని రాష్ట్రాలకు కేంద్రం అన్యాయం చేస్తోంది. మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు భారీ ప్రాజెక్టులను ప్రకటించారు. ఇది భాజపా బడ్జెట్ కాదని.. దేశ బడ్జెట్ అంటూ సమర్థించుకుంటున్నారు. కానీ, దీనిపై రేపు పార్లమెంట్‌లో నిరసన తెలిపాలని కూటమి నిర్ణయం తీసుకుంది. న్యాయం కోసం పోరాడతాం" అని ఆయన పేర్కొన్నారు. తమ కుర్చీని కాపాడుకునేందుకు ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంటూ రాహుల్ గాంధీ కేంద్రంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కొన్ని రాష్ట్రాల పట్ల మోదీ సర్కార్ వివక్ష చూపుతోందంటూ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మండిపడ్డారు.

# బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

**- బడ్జెట్ రాజకీయ ప్రేరేపితంగా ఉంది: మంత్రి ఉత్తమ్**

హైదరాబాద్ (ప్రజా మంటలు):



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. తెలంగాణను పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. విభజన చట్టం హామీలను తప్పనిసరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్ రాజకీయ ప్రేరేపితంగా ఉందని, ప్రజల కోసం పెట్టింది కాదని విమర్శించారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్.. తెదేపా, జేడీయూని ప్రసన్నం చేసుకునేందుకు పెట్టినట్లుగా ఉందన్నారు. బిహార్‌కు రూ.41వేల కోట్లు ఆర్థిక సాయం.. ఏపీకి రూ.15వేల కోట్లు, పోలవరం పూర్తికి నిధులు కేటాయించి.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. 'ఏపీకి కేంద్రం ప్రత్యేక నిధులు ఇవ్వడాన్ని వ్యతిరేకించట్లేదు.. కానీ, తెలంగాణ పట్ల చూపుతున్న వివక్షను తీవ్రంగా ఖండిస్తున్నాం. సీఎం నేతృత్వంలో తెలంగాణ మంత్రుల బృందం గత ఏడు నెలలుగా అన్ని మంత్రిత్వశాఖలకు నిధులు కేటాయించాలని కోరుతూ పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకుండాపోయింది. ఏపీలో పోలవరం నిర్మాణానికి హామీ ఇచ్చిన కేంద్రం.. తెలంగాణలో పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి ఎలాంటి హామీ ఇవ్వలేదు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ తదితర అర్హమైన వాటికి నిధులు ఇవ్వలేదు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని హామీలను నెరవేరుస్తామని ఆర్థిక మంత్రి చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నాంఅని మంత్రి ఉత్తమ్ అన్నారు.

# కక్షపూరిత వివక్ష

ఇందుకు నిరసనగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం మంత్రులు పొన్నం పరభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు తదితరులతో కలసి కేంద్ర బడ్జెట్‌పై ఆయన మీడియాతో మాట్లాడారు. బడ్జెట్‌లో తెలంగాణ అనే పదాన్నే నిషేధించారని మండిపడ్డారు. 'మా ప్రభుత్వంలోని మంత్రులు 18 సార్లు దిల్లీకి వెళ్లారు. తెలంగాణకు అవసరమైన నిధులు ఇవ్వాలని స్వయంగా నేను ప్రధానికి విజ్ఞప్తి చేశా. కానీ, తెలంగాణ పదం పలకడానికి కేంద్రం ఇష్టపడటం లేదు. మొదటి నుంచి ప్రధాని మోదీ తెలంగాణ పట్ల కక్ష కట్టారు. ఇప్పటి వరకు ఆర్ఆర్ఆర్‌కు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఏ రంగానికీ సహకారం అందించలేదు. వికసిత్ భారత్‌లో తెలంగాణ భాగం కాదని ప్రధాని అనుకుంటున్నారు. బడ్జెట్‌లో బిహార్, ఏపీని మాత్రమే పట్టించుకున్నారు. ఇతర రాష్ట్రాలను పట్టించుకోలేదు. 8 సీట్లు ఇచ్చి తెలంగాణ ప్రజలు భాజపా పట్ల వివక్ష చూపలేదు. 8 సీట్లు ఇవ్వడం వల్లే మోదీ ప్రధాని కుర్చీలో ఉన్నారు. తెలంగాణకు ఐఐఎం ఇవ్వలేమని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లేఖ రాశారు. అలాంటప్పుడు కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి ఎందుకు కొనసాగుతున్నారు? కేంద్రమంత్రి పదవి కోసం కిషన్‌రెడ్డి.. తెలంగాణ హక్కులను మోదీ వద్ద తాకట్టుపెట్టి ప్రజలను మోసం చేస్తున్నారు. పోలవరానికి నిధులిచ్చిన కేంద్రం.. పాలమూరు-రంగారెడ్డికి ఎందుకు నిధులు ఇవ్వట్లేదు?తెలంగాణపై కేంద్రం చూపించే వివక్ష మంచిది కాదు'అని సీఎం రేవంత్ అన్నారు. తెలంగాణకు ఎలాంటి కేటాయింపులు లేకపోవడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష చూపిందని మండిపడ్డారు. తెలంగాణపై కేంద్రం కక్ష సాధించినట్లుందని.. బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ' ప్రధాని తెలంగాణకు వస్తే స్వాగతం పలికి పెద్దన్న పాత్ర పోషించమని అడిగాను. పెద్దన్నలా ఉండాల్సిన ప్రధానికి ఇది సరికాదు. ఢిల్లీకి వెళ్లి కేంద్రాన్ని నిధులు అడిగాం. ప్రధాని మోదీని నేనే మూడుసార్లు కలిసి అడిగాను. కేంద్ర, రాష్ట్ర సంబంధాలను మెరుగుపరుద్దామని ప్రధానితో చెప్పాను. అయినా తెలంగాణకు అన్యాయం జరిగింది. మా మంత్రులు కూడా కేంద్ర మంత్రులను కలిశారు. 18 సార్లు ఢిల్లీ వెళ్లి నిధులు ఇవ్వాలని కోరాం.. తెలంగాణ ఏర్పాటు పట్ల మోదీకి ఉన్న కక్షను మరోసారి చాటారు' అని రేవంత్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఏపీకి ఎన్నిరకాలుగా కేటాయింపులు చేయాలో అన్ని రకాలుగా కేటాయించారు. ఏపీకి ఎందుకు నిధులు ఇస్తున్నారు..? అని మేం అడగడం లేదు. పునర్విభజన చట్టంలో పేర్కొన్నట్టు ఏపీకి నిధులు కేటాయించారు. తెలంగాణ విషయంలో ఇంత కక్ష ఎందుకు?. గుజరాత్‌కు ఎలా నిధులు కేటాయించారో,మూసీకి అలా నిధులు కేటాయించామని ప్రధాని మోదీని అడిగాను. హైదరాబాద్‌కు నిధులు ఇస్తే దేశ ఎకానమికి ఉపయోగపడుతుందని మోదీకి వివరించాను. పదేండ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఐటీఐఆర్ కారిడార్ మరుగున పడింది. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ స్లోగన్ బోగస్ అని బీజేపీ నిరూపించింది. వికసిత్ భారత్‌లో మా రాష్ట్రం ఉండదా?' అని కేంద్రంపై రేవంత్ ప్రశ్నల వర్షం కురిపించారు. 'కేంద్ర బడ్జెట్ కుర్చీ బచావో బడ్జెట్‌లాగా ఉంది. ఇంత కక్షపూరిత బడ్జెట్ గతంలో ఎప్పుడూ లేదు. తెలంగాణ ఓట్లు, సీట్లు మాత్రమే బీజేపీకి కావాలని ఎన్నికల ముందే చెప్పాను. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బాధ్యత వహించి మోదీ మంత్రివర్గం నుంచి తప్పుకోవాలి. ప్రతి రాష్ట్రంలో ఐఐఎం ఉంది. తెలంగాణకి ఇవ్వండి అని లేఖ రాశాను. తెలంగాణకు ఐఐఎం ఇవ్వము అని ధర్మేంద్ర ప్రధాన్ మూడు రోజుల క్రితం

లేఖ రాశారు. కేంద్ర బడ్జెట్ ఏపీ, బీహార్ కోసమే పెట్టినట్టు ఉంది. కుర్చీ లాలూచీలో తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. మా ఎంపీలతో పార్లమెంట్‌లో నిరసన తెలియచేస్తాం. తెలంగాణకి అన్యాయం జరుగుతుంటే తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు చూస్తూ ఊరుకోరు. ఏపీ పునర్విభజన చట్రంలో ఏపీకి ఇవ్వాల్సిన అంశాలతో పాటు తెలంగాణకి ఇవ్వాల్సిన అంశాలు ఉన్నాయి. బడ్జెట్ సవరించే అవకాశం ఉంది. బడ్జెట్ సవరించి మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, ఫార్మా విలేజ్ నిర్మాణం కోసం నిధులు ఇవ్వాలి. బీజేపీ చేతకానీ తనం, బానిస మనస్తత్వం వల్ల తెలంగాణ అన్యాయం అవుతోంది' అని కేంద్రంపై రేవంత్ మండిపడ్డారు.

# బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి

వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, ఉద్యోగ కల్పన-నైపుణ్యాభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక రంగం, పరిశోధన-ఆవిష్కరణలు, తయారీ-సేవలు, తర్వాత తరం సంస్కరణలు- ఈ తొమ్మిది అంశాలను ప్రాధాన్యంగా తీసుకున్నట్లు కేంద్రం ప్రకటించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఏడోసారి బడ్జెట్ ప్రవేశపెడుతూ.. ఈ అంశాలను ప్రకటించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్ సభలో ప్రవేశ పెట్టారు. తొమ్మిది సూత్రాల ఆధారంగా బడ్జెట్‌రూపకల్పన చేసినట్లు చెప్పారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక రంగం, పరిశోధన, ఆవిష్కరణలు, తయారీ,సేవలు, తర్వాతతరం సంస్కరణలు.. ఈ తొమ్మిది సూత్రాల ప్రాధాన్యంగా తీసుకుని బడ్జెట్ రూపొందించినట్లు తన ప్రసంగంలో విత్త మంత్రి ప్రకటించారు. ఇక ఈ బడ్జెట్ మొత్తంలో వివిధ రంగాలన్నింటికి కలిపి రూ.48.21 లక్షల కోట్ల కేటాయింపులు చేశారు. అంటే స్థూలంగా బడ్జెట్ పరిమాణం రూ.48.21 కోట్లు. ఇందులో మొత్తం ఆదాయాన్ని రూ.32.07 లక్షల కోట్లుగా, దానిలో పన్ను ఆదాయాన్ని రూ.28.83 లక్షల కోట్లుగా చూపించారు. ఈ ఏడాది ద్రవ్యలోటు 4.9 శాతంగా ఉండవచ్చని అంచనా వేశారు. అప్పులు, పన్నేతర ఆదాయాలు రూ.16 లక్షల కోట్లుగా అంచనా కట్టారు. అదేవిధంగా నూతన పింఛన్ విధానంలో త్వరలో మార్పులు చేయనున్నట్లు తెలిపారు. బడ్జెట్‌లో రైతులు,యువతపై ఎక్కువ దృష్టి పెట్టారు. యూత్ కు 2 లక్షల కోట్లు కేటాయించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించారు. మొబైల్స్, బంగారంపై కస్టమ్స్ డ్యూటీని తగ్గించారు. ఆదాయపు పన్ను శ్లాబులను సవరించారు. అయితే ఉద్యోగస్థులకు పెద్దగా ఉరట కల్పించలేక పోయారు. టాప్ 500 కంపెనీలలో కోటి మంది యువతకు 12 నెలల ఇంటర్న్ షిప్ అవకాశాలు కల్పించేనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్న్ షిప్ భత్యంగా నెలకు రూ.5000, వన్ టైమ్ అసిస్టెన్స్ కింద రూ. 6000 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇక కంపెనీలు ఇంటర్న్ షిప్ వ్యయంలో 12 శాతం భరించాల్సి ఉంటుంది. బీహార్, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై కూడా దృష్టి సారిస్తామని నిర్మలా సీతారామన్ అన్నారు. బీహార్ లో విమానాశ్రయాలు, మెడికల్ కాలేజ్ లు, క్రీడల మౌలిక వసతులు ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీహార్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆందప్రదేశ్ రాష్ట్రాలను అభివృద్ధి పరుస్తామన్నారు. కాగా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి రూ. 15000 కోట్లను కేటాయించారు. మొబైల్ ఫోన్లపై, యాక్ససెరీలపై, ఛార్జర్స్ పై 15 శాతం తగ్గింపు ఉంటుందన్నారు. ఉన్నత విద్య, దేశీయ సంస్థలకు రూ. 10 లక్ష ల కోట్లు కేటాయించారు. ఇకపోతే స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) లోటు 4.9 శాతం ఉండగలదన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 4.5 శాతం ఆర్థిక లోటుకే చేరుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. వచ్చే రెండేళ్లలో కోటిమంది రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. కూరగాయల ఉత్పత్తి పెద్దఎత్తున చేపట్టేలా క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు భారీగా కేటాయింపులు చేశారు. ముఖ్యంగా సేంద్రీయ వ్యవసాయంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ. 1.52 లక్షల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. వచ్చే రెండేళ్లలో కోటి మంది రైతులు సేంద్రీయ వ్యవసాయంలోకి ప్రవేశించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వ్యవసాయంలో స్థిరమైన పద్ధతులు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఉత్పత్తి పెంపుదలపై దృష్టి సారించామని.. ఆ దిశగా కార్యక్రమాలు చేపడతున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారమన్ తెలిపారు.అంతేకాదు.. వాతావరణ పరిస్థితులను తట్టుకునే, అధిక దిగుబడినిచ్చే ఉద్యానవన పంటలకు సంబంధించి 109 కొత్త వంగడాలను ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. వ్యసాయ రంగానికి కేటాయించిన రూ. రాష్ట్రాల భాగస్వామ్యంతో ప్రభుత్వం వ్యవసాయానికి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్టక్చర్‌ను ప్రోత్సహిస్తుందని ప్రకటించారు. ఇక గ్రామీణాభివృద్ధి కోసం రూ. 2.66 లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. వ్యవసాయ ఉత్పాదతకు పెంపొందించడానికి, వాతావరణాన్ని తట్టుకోగల రకాలను అభివృద్ధి చేయడానికి వ్యవసాయ పరిశోధన శాలను ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం సమగ్ర సమీక్ష చేస్తుందన్నారు. ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన మధ్యంతర బ్జడెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. నూనెగింజల ఉత్పత్తి కోసం ఒక వ్యూహాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. రైతుల ఆదాయం పెంచడం, వ్యవసాయ విలువను పెంచడం దిశగా ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల మద్దతుతో పంట అనంతర కార్యకలాపాలలో పెట్టుబడులను ప్రోత్సహించడం, పాడి రైతులకు సాధికారత, నానో-డిఎపిని అన్ని వ్యవసాయ-వాతావరణ మండలాలకు విస్తరించడం, 5 ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కుల ఏర్పాటు, ఆక్వాకల్చర్‌ను ప్రోత్సహించడానికి బ్లూ ఎకానమీ 2.0 ప్రారంభం, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన అమలును వేగవంతం చేయడం, 11.8 కోట్ల మంది రైతులకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు కేంద్ర ఆర్థిక మంత్రి. చిన్న రైతును దృష్టిలో ఉంచుకుని ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను ప్రోత్సహించడంపై దృష్టి పెట్టారు. చిరు ధాన్యాలను పండించడం, స్టార్టప్‌లను ప్రోత్సహించడంపైనా ఫోకస్ పెట్టింది.భారతదేశ వ్యవసాయ రంగం వారసత్వ సమస్యలలో కొట్టుమిట్టాడు తూనే ఉంది. ఇప్పటికీ దేశ జనాభాలో అధిక శాతం మంది ప్రజలు దీనిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అయినప్పటికీ, వ్యవసాయం సమర్థత లోపించి తక్కువ ఆదాయ వృత్తిగా మిగిలిపోయింది. వ్యవసాయ ఉపాధి అవకాశాలను సృష్టించడంతోపాటు వాణిజ్యీకరణ, వైవిధ్యీకరణ దిశగా పయనించాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. మధ్యతరగతి ప్రజలుపై ప్రధానంగా ఫోకస్ చేయడం జరిగిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దేశ వ్యాప్తంగా 4.1 కోట్ల మంది యువతీ, యువకులకు లబ్ది చేకూర్చేందుకు ప్రభుత్వం ఈ రంగాలపై దృష్టి సారిస్తుందని సీతారామన్ చెప్పారు. ఈ రంగాలలో పథకాలు, చర్యలు - ప్రస్తుతం ఉన్నవి, ప్రకటించబోయేవి అన్నింటికి కలిపి ఐదు సంవత్సరాల



వ్యవధిలో రూ. 2 లక్షల కోట్ల నిధులను ఖర్చు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించారు. ÷ూనున్న ఐదేళ్లలో 20 లక్షలమందికి నైపుణ్యాభివృద్ధి సంస్థల ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించారు. నైపుణ్యాభివృద్ధి కేంద్రాలకు అవసరమైన రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. భారతీయ విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులకు 3 శాతం వడ్డీ రాయితీ కల్పిస్తామన్నారు. స్వయం ఉపాధి పొందుతున్న చేతివృత్తి మహిళలకు రుణ సాయం పెంచుతున్నట్లు ప్రకటించారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఎంఎస్ఎంఈ క్లస్టర్లు నూతన సిడ్‌బీ బ్యాంకు బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ఎగుమతులు, ఎగుమతుల సేవలకు ప్రత్యేక ప్లాట్‌ఫాం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. 500 పెద్ద కంపెనీల్లో కోటి మంది యువతకు ఉద్యోగాల కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ క్రమంలో బీహార్, ఆంధ్రప్రదేశ్‌లకు ఈ బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించారు. ఈ నేపథ్యంలో బుద్ధగయ, రాజ్‌గిర్, వైశాలి, దర్భంగాలలో రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామని ఆర్థిక మంత్రి తెలిపారు. బీహార్‌లో వివిధ రహదారుల ప్రాజెక్టుల కోసం రూ.26,000 కోట్లను బడ్జెట్ ప్రతిపాదించింది. బీహార్‌కు బహుపాక్షిక అభివృద్ధి సంస్థల సహాయంతో ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని చెప్పారు. బీహార్‌లో విమానాశ్రయాలు, వైద్య కళాశాలలు, క్రీడా మౌలిక సదుపాయాలను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు. బీహార్‌లోని పీర్‌పైంటిలో 2400 మెగావాట్ల కొత్త పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడంతోపాటు విద్యుత్ ప్రాజెక్టులను రూ.21,400 కోట్లతో చేపట్టనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని హామీలను నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. రాష్ట్ర రాజధాని ఆవశ్యకతను గుర్తించి, బహుపాక్షిక ఏజెన్సీల ద్వారా ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని అందిస్తామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ. 15,000 కోట్లు కేటాయించబడతాయన్నారు. పోలవరం నీటిపారుదల ప్రాజెక్టుకు నిధులు సమకూర్చి పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆర్థిక మంత్రి తెలిపారు. ఈ క్రమంలో బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆంధప్రదేశ్‌ల సర్వతోముఖాభివృద్ధికి కేంద్రం 'పూర్వోదయ' పథకాన్ని కూడా తీసుకురానుంది. తూర్పు ప్రాంతంలో పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తుందని సీతారామన్ చెప్పారు.

# ఎమ్మెల్యే లాస్యనందితకు అసెంబ్లీ నివాళి

**సభలో సంతాప సిఎం రేవంత్ సంతాప తీర్మానం**

**ఇలాంటి తీర్మానం ప్రవేశ పెట్టాల్సి రావడం బాధాకరం**

**సాయన్న ఆశయాలను ముందుకు తీసుకు వెళతామని ప్రకటన**

**కెటిఆర్, పలువురు మంత్రులు తదితరుల సంతాపం**



హైదరాబాద్,జూలై23 (ప్రజా మంటలు):
దివంగత ఎమ్మెల్యే లాస్యనందితకు తెలంగాణ శాసనసభ ఘనంగా నివాళి అర్పించింది. బడ్జెట్ సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సభ ప్రారంభం కాగానే.. కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత మృతికి సంతాపంగా సీఎం రేవంత్‌రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఇలాంటి బాధాకరమైన తీర్మానం ప్రవేశపెట్టాల్సి వచ్చినందుకు చింతిస్తున్నట్లు చెప్పారు. లాస్య నందిత తండ్రి సాయన్న తనకు అత్యంత సన్నిహితులు, ఆప్తులు. చాలా సంవత్సరాలు మేం కలిసి పనిచేశాం. ఎమ్మెల్యేలుగా ప్రజాక్షేత్రంలో పనిచేశాం. సాయన్న కంటోన్మెంట్ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ఆయన మరణించడంతో తండ్రి వారసత్వాన్ని, బాధ్యతలను నెరవేర్చేందుకు ఆయన కుమార్తె లాస్య నందిత ప్రజాజీవితంలోకి వచ్చారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కంటోన్మెంట్ ప్రజలు, మహిళల తరఫున చిత్తశుద్ధితో పోరాడతారని భావించాం. కానీ దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో ఆమె మరణించారు. తలకు తీవ్ర గాయమై చనిపోయారని వైద్యులు చెప్పారు. ఆ కుటుంబానికి ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయి. కంటోన్మెంట్ ప్రజల హృదయాల్లో సాయన్న, లాస్య నందిత శాశ్వతంగా నిలిచిపోతారు. వారు చేయాలనుకున్న పనులను ఈ ప్రభుత్వం పూర్తిచేస్తుంది. ఆమె మృతిపట్ల సంతాపం ప్రకటిస్తున్నాను. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను అని సీఎం రేవంత్ చెప్పారు. ఏడాది వ్యవధిలోనే తండ్రీకుమార్తెలు మృతిచెందడం చాలా బాధాకరమని భారాస ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. లాస్య నందిత మృతికి సంతాపంగా శాసనసభలో ప్రవేశపెట్టిన సంతాప తీర్మానంపై ఆయన మాట్లాడారు. సాయన్న మరణించిన తర్వాత ఆ కుటుంబానికి అండగా ఉంటామని అప్పటి సీఎం కేసీఆర్ సభలో హామీ ఇచ్చారు. దాని ప్రకారం పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆయన కుమార్తె లాస్య నందితకు అవకాశం కల్పించారు. రాజకీయాలకు అతీతంగా అందరితో సాయన్న కలిసి ఉండేవారు. తండ్రి ఆశీస్సులు, పార్టీ అండతో నందిత బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిచారు. ఆ తర్వాత నల్గొండ జిల్లాలో ఆమె ప్రయాణిస్తున్న వాహనానికి ప్రమాదం జరిగింది. ఆ సమయంలో లాస్య నందిత తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఆ తర్వాత ఆమె ఇంట్లో లిఫ్ట్ ప్రమాదం జరిగింది. అక్కడికి కొద్దిరోజులకే ఓఆర్ఆర్‌పై రోడ్డుప్రమాదంలో చనిపోయారు. వరుసగా పగబట్టినట్లే ఈ ఘటనలు జరిగాయి. మంచి వ్యక్తిత్వం, విద్యార్హతలు కలిగిన లాస్య నందిత ప్రజలకు ఎంతో సేవ చేస్తారని భావించాం. ఆ కుటుంబానికి అండగా ఉంటాం అని కేటీఆర్ అన్నారు. కంటోన్మెంట్‌లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన లాస్య నందిత.. తన నియోజకవర్గంలో మంచి పేరు సంపాదించాలనే తాపత్రయం, తపన ఆమెలో ఉండేదని ఎమ్మెల్యే వివేకానంద్ గౌడ్ గుర్తు చేశారు. లాస్య నందిత మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం. సాయన్న తన నియోజకవర్గం పేరుతోనే పిలవబడేవారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఆయన సుపరిచితుడు. అందరితో మంచి సంబంధాలు కలిగి ఉన్న వ్యక్తి. ఆయన బిడ్డలు కూడా ఎంతో చురుకుగా ప్రజాక్షేత్రంలో ఉండేవారు. ప్రజల మన్ననలు పొందారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత అందరిని ప్రత్యక్షంగా కలిసి, మీ అందరి సహకారం, సూచనలు, సలహాలు కావాలని అడిగేది. నియోజకవర్గంలో మంచి పేరు సంపాదించాలని తపనతో ఉండేది ఆమె అని వివేకానంద్ గౌడ్ పేర్కొన్నారు. నేను కొత్తగా ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పుడు సాయన్న సీనియర్ ఎమ్మెల్యే. హైదరాబాద్ పరిధిలోని మా 15 మంది ఎమ్మెల్యేల్లో వారు సీనియర్. ప్రభుత్వాన్ని ఈ విధంగా ప్రశ్నలు అడగాలి. ప్రజా సమస్యలు ఇలా లేవనెత్తాలని చెప్పి ప్రోత్సహించారు సాయన్న. సాయన్న ఎంతో అండగా ఉండేవారు. తనకు సాయన్న సహకారం అందించినట్లే నందితకు కూడా సహకారం అందించాలని అనుకున్నాం. కానీ ఆమె మరణించడం బాధాకరం. కవాడిగూడ కార్పొరేటర్‌గా గెలిచినప్పుడు కూడా ఆమె 150 మంది కార్పొరేటర్లతో కూడా మంచి పేరు సంపాదించుకున్నారు. జీహెచ్ఎంసీ జనరల్ బాడీ మీటింగ్‌లో కూడా లాస్య నందిత సేవలను గుర్తు చేసుకున్నారు. ఆమె ఎంతో అంకితభావంతో పని చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా. బీఆర్ఎస్ పార్టీ తరపున ఆమె కుటుంబానికి అండగా ఉంటాం అని ఎమ్మెల్యే వివేకానంద్ గౌడ్ స్పష్టం చేశారు. కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత మన నుంచి దూరం కావడం బాధాకరమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. తొలిసారిగా అసెంబ్లీకి ఎన్నికైన లాస్య నందిత మృతి చెందడం బాధాకరం. తన తండ్రి సాయన్న ఆశయాలు నెరవేర్చాలని లాస్య నందిత రాజకీయరంగ ప్రవేశం చేశారు. లాస్యనందిత ప్రజా సేవ చేయాలనే ఆత్రుతతో ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ మనం నుంచి దూరమైంది. అతి చిన్న వయసులో శాసనసభలో అడుగుపెట్టిన నందితకు పెద్దలంటే ఎంతో గౌరవం ఉండేది. నిజంగా హడావిడిగా ఉంటూ సందడి చేసేది ఆమె. నందిత మృతిపట్ల సంతాపం తెలియజేస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. పలువురు మంత్రులు, ప్రతిపక్ష నేతలు దివంగత నేత, కంటోన్మెంట్ మాజీ ఎమ్మెల్యే సాయన్న కుటుంబాన్ని గుర్తుచేసుకున్నారు. ఆమె తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే సాయన్న చనిపోయిన ఏడాదిలోపే లాస్య కూడాచనిపోవడం చాలా బాధాకరం అన్ని విచారం వ్యక్తం చేశారు. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సభను బుధవారానికి వాయిదా వేసారు.

## గన్‌పార్క్ వద్ద బిఆర్ఎస్ ఎమ్మెల్యేల నివాళి



హైదరాబాద్,జూలై23 (ప్రజా మంటలు):
అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే ముందు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు గన్ పార్కు వద్ద తెలంగాణ అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జై తెలంగాణ, జోహార్ తెలంగాణ అమరవీరులకు జోహార్.. జోహార్.. అంటూ నినదించారు. కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం గన్ పార్కు నుంచి అసెంబ్లీలోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలం దరూ నడుచుకుంటూ వెళ్లారు. అమరవీరులకు నివాళులర్పించిన వారిలో కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి, పాడి కౌశిక్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, ముఠా గోపాల్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానంద్ గౌడ్, కాలేరు వెంకటేశ్, గంగుల కమలాకర్, మాగంటి గోపీనాథ్, మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్ రెడ్డి, అనిల్ జాదవ్, మల్లారెడ్డి, చింతా ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

## విపక్షనేత కెసిఆర్‌కు ఛాంబర్

**స్పీకర్ తీరుపై కెటిఆర్ అసహనం**



హైదరాబాద్,జూలై23 (ప్రజా మంటలు):
అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కేటాయించిన ఛాంబర్‌పై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గత సమావేశాల సందర్భంగా ఇన్నర్ లాబీలోని ఎల్‌వోపీ కార్యాలయాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తొలగించిన విషయం తెలిసిందే. ఔటర్ లాబీలో ఎల్‌వోపీకి ఛాంబర్ ఏర్పాటు చేశారు. రెండు రూమ్‌లు కలిపి ఒకే రూంగా అసెంబ్లీ సిబ్బంది మార్చేశారు. అయితే రూం మధ్యలో టాయిలెట్ పెట్టి వాడుకోవడానికి అనుకూలంగా లేకుండా చేశారని కేటీఆర్ మండిపడ్డారు. ఈ అంశాన్ని బీఏసీలో లేవనెత్తాలని మాజీ మంత్రి హరీష్‌రావుకు కేటీఆర్ సూచించారు. స్పీకర్‌ను కలిసి అభ్యంతరం వ్యక్తం చేయాలని కేటీఆర్ నిర్ణయించారు.



జగిత్యాల పట్టణం లోని మున్సిపల్ పార్కులో అభివృద్ధి పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్.

# బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

**ఒక్క కేటాయింపు కూడా లేకపోవడం దారుణం**

**ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా మిగిలింది సున్నా**

**స్వీయ అస్తిత్వమే మనకు శ్రీరామరక్ష అన్న కెటిఆర్**



హైదరాబాద్,జూలై23 (ప్రజా మంటలు):
తెలుగు కోడలు నిర్మలా సీతారామన్ తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈసారికూడా ఏమైనా భారీగా నిధులు కేటాయిస్తారని ఆశించాం.. దక్కింది శూన్యం అని కేటీఆర్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై కేటీఆర్ స్పందిస్తూ.. బడ్జెట్ మొత్తంలో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం బాధాకరమన్నారు. రూ. 48 లక్షలు ఇరవై ఒక్కవేల కోట్లతో బడ్జెట్ పెట్టినప్పటికీ కేవలం కొన్ని రాష్ట్రాలకు మాత్రమే పెద్దపీట వేశారు. తెలంగాణకు మరొకసారి దక్కింది గుండు సున్నానే అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విజన చట్టంలో దాదాపు 35 హామీల పైన నిర్ణయం తీసుకోవాలని గతంలో కేసీఆర్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. అనేకసార్లు అభ్యర్థిస్తూ లేఖలు కూడా రాశాం. ములుగు యూనివర్సిటీకి అదనపునిధులు, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ.. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఊసే లేదు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోలేవటం లేదు అని కేటీఆర్ తెలిపారు. ఐఐఎం సహా నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ వంటి కేంద్ర జాతీయ సంస్థలను ఇవ్వమని మేము కోరినప్పటికీ ఒక్కటి కూడా ఇవ్వలేదు. తెలంగాణ నుంచి ముంబై-నాగపూర్, బెంగళూరు- చెన్నై వంటి మార్గాల్లో పారిశ్రామిక కారిడార్లకు నిధులు అడిగినప్పటికీ వాటి గురించి స్పందన లేదు. మెగా పవర్ లూమ్ క్లస్టర్‌తో పాటు నూతన హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని అడిగిన కూడా కేంద్రం స్పందించలేదన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి, మంత్రులు వెళ్లి ఢిల్లీలో అడిగిన వాటిని కూడా పట్టించుకోలేదు. తెలంగాణకు మరోసారి ఈ కేంద్ర బడ్జెట్ దక్కింది గుండు సున్నా. తెలంగాణలో 16 స్థానాలను బీజేపీ, కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీలకు ఇస్తే ఏం జరిగిందో తెలంగాణ ప్రజలు ఆలోచించాలి. 16 స్థానాలు ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు, బీహార్‌కి దక్కిన నిధులను చూసైనా తెలంగాణ ప్రజలు ఆలోచన చేయాలి. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అన్న విషయాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరముంది. ఎందుకు ప్రాంతీయ శక్తులను బలోపేతం చేసుకోవాలో మరోసారి ఈ బడ్జెట్ తెలియ జేస్తోందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఒక్క మాట కూడా పార్లమెంట్‌లో మాట్లాడలేదు. ఇదే గులాబీ కండువా కప్పుకున్న ఎంపీలు పార్లమెంట్‌లో గనుక ఉంటే కేంద్ర వ్యతిరేక వైఖరిని గట్టిగా వ్యతిరేకించే వాళ్ళు. 8 మంది ఎంపీలను ఇచ్చినా బీజేపీ ప్రభుత్వం గుడ్డు సున్నా నిధులు ఇచ్చినందుకు తెలంగాణ ప్రజలు తప్పకుండా బుద్ధి చెప్తారు. ఆంధప్రదేశ్‌కు నిధులు ఎక్కువ ఇచ్చినందుకు మాకు ఏం బాధ లేదు. సోదర రాష్ట్రంగా వారికి వచ్చిన కేటాయింపులపైన, వారు బాగుండాలని కోరుకుంటున్నాం. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం పేరు చెప్పిన ప్రతిసారి ఎక్కడ కూడా తెలంగాణ ఆనే పదం ప్రస్తావించలేదు. రాజధాని అమరావతి కోసం, పోలవరంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక నిధులు అందిస్తామని చెప్పారు. ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్లకు ప్రత్యేక నిధులు ఇస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన భారీ నిధుల పట్ల మాకు ఎలాంటి దుగ్ధలేదు.. సంతోషమే. కానీ ఆంధప్రదేశ్, బీహార్‌కు మాత్రమే ఇచ్చి మిగిలిన 26 రాష్ట్రాలను చిన్న చూపు చూడడం నిజంగా బాధాకరం. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం పేరు చెప్పిన మీరు తెలంగాణ రాష్ట్ర డిమాండ్లను మాత్రం పట్టించుకోలేదు అని కేటీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

# రైల్వేకు పెద్దపీట

**- రూ.2.62 లక్షల కోట్లు.. - 'కవచ్'పై దృష్టి సారిస్తాం**

**- రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్**

దిల్లీ (ప్రజా మంటలు):
ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైల్వేకు రూ. 2.62 లక్షల కోట్లు కేటాయింపులు జరిపినట్లు కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ తెలిపారు. ఈ మొత్తంలో రైల్వేలో భద్రతా వ్యవస్థల మెరుగు, కవచ్ ఇన్‌స్టలేషన్ కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. బడ్జెట్‌లో రైల్వేకు సంబంధించిన కేటాయింపులపై విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్‌లో రైల్వేకు ఎప్పుడూ లేని విధంగా రూ. 2,62,200 కోట్లు కేటాయించినట్లు అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. ఇందులో రూ. 1.08 లక్షల కోట్లు రైల్వే భద్రతకు వినియోగించనున్నట్లు తెలిపారు. పాత ట్రాకుల స్థానే కొత్తవి ఏర్పాటు, సిగ్నలింగ్ వ్యవస్థ మెరుగు, ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం, కవచ్ వ్యవస్థ ఇన్‌స్టలేషన్ ఇందులో ఉన్నాయన్నారు. అన్నింటిలో కల్లా కవచ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఇటీవలే కవచ్ 4.0కు ఆమోదం లభించిందని, ఇన్‌స్టలేషన్ త్వరతిగతిన చేపడతామని వెల్లడించారు.

**మోదీ హయాంలోనే అధికం**

ప్రస్తుతం అధికారంలో ఉన్న మోదీ సర్కారుకు, యూపీఏ హయాంలో రైల్వేకు కేటాయింపులను ఈ సందర్భంగా అశ్వనీ వైష్ణవ్ ప్రస్తావించారు. 2014లో రైల్వేకు రూ. 35 వేల కోట్లు మాత్రమే కేటాయించారని, ఇప్పుడు ఆ మొత్తం రూ. 2.62 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. 2014కు ముందు గడిచిన 60 ఏళ్లలో 20 వేల కిలోమీటర్ల రైల్వే మేర రైల్వే మార్గం విద్యుదీకరించగా.. గడిచిన పదేళ్లలోనే 40 వేల కిలోమీటర్లను పూర్తి చేసినట్లు తెలిపారు. 2014లో సగటున రోజుకు 4 కిలోమీటర్ల మేర ట్రాకుల నిర్మాణం జరగ్గా.. ఇప్పుడు సగటున రోజుకు 14.5 కిలోమీటర్ల ట్రాకులు నిర్మితమవుతున్నాయని చెప్పారు. మధ్యతరగతిని దృష్టిలో పెట్టుకుని ఒక్కో రైలులో మూడింట రెండొంతులు సాధారణ కోచ్‌లు, ఒక వంతు ఏసీ కోచ్‌లు ఉండేలా చూస్తున్నట్లు వైష్ణవ్ చెప్పారు. జనరల్ కోచ్‌లకు ఉన్న డిమాండ్ దృష్ట్యా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే 2,500 అదనపు జనరల్ కోచ్‌లను అందుబాటులోకి తీసుకురానున్నామని, మరో 10వేల సాధారణ కోచ్‌ల తయారీ చేపట్టనున్నామని చెప్పారు. ఈ రెండింటికీ బడ్జెట్‌లో కేటాయింపులు జరిపినట్లు తెలిపారు. యూపీఏ హయాంలో రైల్వే పరిధిలో 4.11 లక్షల కోట్ల ఉద్యోగాలు కల్పించగా.. మోదీ హయాంలో గడిచిన పదేళ్లలో 20 శాతం అధికంగా ఉద్యోగ కల్పన జరిగిందని అశ్వనీ వైష్ణవ్ చెప్పారు.

# రెండు రోజుల్లోగా నీట్ తుది ఫలితాలు - ధర్మేంద్ర ప్రధాన్

దిల్లీ (ప్రజా మంటలు):
నీట్-యూజీ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్వాగతించారు. ఈ పరీక్ష మళ్లీ నిర్వహించాల్సిన అవసరం లేదంటూ సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. "సత్యమే గెలిచింది.."అని వ్యాఖ్యానించారు.
నీట్ తుది ఫలితాలను రెండు రోజుల్లోగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేస్తుందని వెల్లడించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఆయన దిల్లీలో మీడియాతో మాట్లాడారు."ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం పరిమితంగానే జరిగినట్లు కేంద్ర ప్రభుత్వం ముందు నుంచీ చెబుతోంది. ఇప్పుడు సుప్రీం కోర్టు సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. పరీక్షల విషయంలో ఎటువంటి ఉల్లంఘనలు జరిగినా ఉపేక్షించం.. పరీక్షల పవిత్రతే మాకు అత్యంత ముఖ్యం. పరీక్షల్లో ఎవరైనా అవకతవకలకు పాల్పడినట్లు తేలితే.. వదిలిపెట్టం. నీట్ యూజీ తుది ఫలితాలను ఎన్టీయే రెండు రోజుల్లోగా ప్రకటిస్తుంది. సుప్రీంకోర్టు పరిశీలన ప్రకారమే నీట్ యూజీ మెరిట్ జాబితాను సవరిస్తాం. నీట్ అంశంపై ప్రతిపక్షాలు అరాచకం, అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయి" అని మండిపడ్డారు.

# నియంతల పాలనకు లోక్‌పాల్‌తోనే చెక్ !

తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు విపక్షంలో ఉన్న బిఆర్ఎస్, వైకాపాల తీరు ఒక్కటిగానే ఉంది. ప్రభుత్వంలో ఉండగా అలానే ఉండేది. ఇద్దరి మనస్థత్వాలు ఒక్కటే అన్నది మెల్లగా ఇప్పుడు జనాలకు అర్థం అవుతోంది. అధికారంలో ఉండగా అడ్డూ అదుపు లేకుండా వ్యవహరించారు. చరిత్రలో నియంతలను చూడకున్నా.. ఎలా ఉంటారో ఈ ఇద్దరినీ చూసిన వారికి అర్థం అయివుంటుంది. తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని నయా నియంతలా వ్యవహరించిన కెసిఆర్ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేసి, వ్యవస్థలను భ్రష్టు పట్టించి.. ఇప్పుడు ఎదురుదాడి విమర్శలో తప్పులను కప్పి పుచ్చుకునే తంటాలు పడుతున్నారు. అందుకే అధికార రుచి మరిగిన ఈ ఇద్దరూ ..మరోమారు అధికారంలో ఉండేలా పథకాల రచన చేసి రాష్ట్రాలను దోచేశారు. ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసి రాష్ట్రాలను దివాళా తీయించారు. పథకాల పేరుతో నగదును దోచి పెట్టారు. చేతికి ఎముక లేదన్నట్లుగా పథకాల రూపకల్పనతో నగదు బదిలీలు చేశారు. అభివృద్ధి పేరుతో అప్పులు చేసి సంపద సృష్టించామని గొప్పలు చెప్పారు. ప్యాలెస్‌లు కట్టుకున్నారు. పేదవాడికి ఓ డబుల్ ఇల్లుకు నానా తంటాలు పడ్డా, తమకు మాత్రం రాజప్రసాదాలు కావాలని భావించారు. ఇంతగా డబ్బును వినియోగించి, ప్రజల చెమటను విలాసాలకు ఉపయోగించేశారు. కరిమింగిన వెలగపండులా ఇప్పుడు పరిస్థితి అంతా డొల్లగా మారింది. ఇద్దరూ అధికారం కోల్పోయారు. కొంత వ్యవధి తేడాల ఇద్దరూ విపక్షం లోకి వచ్చారు. ఇప్పుడు కూడా ఈ ఇద్దరి మనస్తత్వం, కార్యక్రమాలు ఒకేరీతిన ఉన్నాయి. మొగుడిని కొట్టి మొగసాలకు ఎక్కిందన్న సామెతలా..చేసిన తప్పులన్నీ చేసినానాయాగీ చేస్తున్నారు. ఎపిలో జగన్ అక్కడంతా అక్రమాలు, అహింస రాజ్యమేలుతున్నాయని గగ్గోలు పెడుతున్నారు. 40 రోజుల్లోనే ఏదో జరిగినట్లు నల్లగుడ్డలు కప్పుకుని మొక్కుబడిగా అసెంబ్లీకి రావడం,పోలీస్ అధికారులపై జులుం ప్రదర్శించ డం కూడా జరిగిపోయాయి. తనకు విపక్ష హోదా ఇవ్వడానికి భయపడుతున్నారని కూడా ఓ రాయి విసిరారు. అధికారంలో ఉన్నా, లేకున్నా హుందాతనం ప్రదర్శించడంలో అటు కెసిఆర్, ఇటు జగన్ ఇద్దరూ విఫలం అయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అధికార మార్పిడి జరిగిన తర్వాత అప్పట్లో పరిస్థితులు ఎలా ఉండేవో ఇప్పుడు ఎలా ఉన్నాయో ప్రజలకు అర్థం అవుతోంది. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఇంతగా ఎందుకు దిగజారిపోయారా అని అనుమానం కలుగుతోంది. ఎపిలో జగన్ అధికారంలో ఉండగా ఒక రకమైన భయానక వాతావరణం ఉండింది. బయటకు విమర్శలు చేస్తే....యూ ట్యూబర్లపైనా కేసులు పెట్టి వేధించిన ఘటనలు చూశాం. ప్రజలంతా భయం గుప్పిట్లో బతికారు. జగన్‌తో పాటు ఆయన కోటరీలో ఉన్న వారి వల్ల అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూసింది. తెలంగాణలో కూడా అధికార వ్యవస్థ భ్రష్టుపట్టి పోయింది. ఫోన్ ట్యాపింగ్‌తో ప్రత్యర్థుల ఫోన్లను ట్యాప్ చేశారు. అధికార దుర్వినియోగం విపరీతంగా సాగింది. ప్రగతి భవన్ పేరిట ప్యాలెస్‌ను పోలిన భవనాన్ని నిర్మింపజేసి అందులో నుంచి కాలు బయటపెట్టకుండా కనుసైగలతో రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు. అయినా ఆయనతో పాటు కొడుకు, అల్లుడి తీరులో మార్పు కనిపించడం లేదు. పాశ్చాత్తాపం కానరావడం లేదు. బటన్లు నొక్కడం వల్ల మళ్లీ అధికారంలోకి వస్తామని జగన్ నమ్మి అడ్డగోలు పనులు చేశారు. అందుకే జగన్‌ను జనం కసిగా ఓడించినా.. కారణాలు తెలుసుకోలేక పోతున్నారు. ఆత్మ విమర్శల చేసుకోవడం లేదు. రోడ్డెక్కి నానా హంగామా చేయాలని చూస్తున్నారు. అందుకే ప్రజలతో పాటు, అణచివేతకు గురైన నేతలు తమకు ఎదురైన అనుభవాలను గుర్తుచేసుకుంటూ పగ తీర్చుకోవాలని రగిలిపోతున్నారు. ఇప్పుడు ఘోర పరాజయం పాలయ్యాక కూడా గుణపాఠం నేర్చుకోకుండా నోటికి పని చెబుతున్నారు. ఈ క్రమంలోనే

అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న వేళ ఢిల్లీలో ధర్నాకు దిగడానికి వెళ్లారు. పల్నాడులో జరిగిన ఓ వ్యక్తిగత హత్యను తనకు అనుకూలంగా మార్చుకోవాలని చేస్తున్న ప్రయత్నంతో ప్రజల్లో భంగపడ్డారు. ఈ హత్యపై గగ్గోలు పెడుతున్న జగన్ సొంత చిన్నాన్న హత్యను పట్టించుకోవడం లేదు. విచారణకు అడుగడుగునా అడ్డు పడ్డారు. వివేకానంద రెడ్డిని హత్య చేయించిన వారిని ముఖ్యమంత్రిగా జగన్ రక్షించారని ప్రజలు నమ్ముతున్నారు. సొంత చెల్లెళ్లు వైఎస్ షర్మిల, డాక్టర్ సునీతలు చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పడం లేదు. అందుకే ఆయన సొంత జిల్లా కడపలో కూడా మూడే స్థానాలు వచ్చాయి. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వంటి వారు కూడా చావుతప్పి కన్ను లొట్టబోయిన చందంగా ఆరేడు వేల స్వల్ప మెజారిటీ తో గెలిచారు. ఇంత జరిగినా జగన్ వైఖరిలో మార్పు రాకపోవడం ఆశ్చర్యంగా ఉంది. రాజకీయం గా వేసిన తప్పటడుగులను సరిచేసుకోవాలన్న ధ్యాస కానరావడం లేదు. ఇది కెసిఆర్ విషయంలోనూ వర్తిస్తుంది. చేసిన తప్పులను పక్కన పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూర్పార పట్టే పనిలో పడ్డారు. శాసనసభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన జగన్ సభా కార్యక్రమాల్లో పాల్గొనకుండా నియంతలా వ్యవహరి స్తున్నారు. సభకు హాజరయ్యే విషయంలో కెసిఆర్, జగన్‌ల తీరు ఒకేలా ఉంది. తాము ఇద్దరమూ శాశ్వతంగా అధికారంలో ఉంటామని కలలు కన్నారు. అందుకే ప్యాలెస్‌లు కట్టుకున్నారు. ప్రజల ధనంతో విలాసాలు అనుభవించారు. సమాజంలో కళ్ళెదురుగా హత్యలు చేసిన, చేయించిన ఘటనలు చూశాం. ప్రభుత్వ వ్యతిరేకత ఆధారంగా నే ఇటీవలి కాలంలో ప్రజలు తీర్పు ఇస్తున్నారనడానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలు ఇచ్చిన తీర్పు నిదర్శనంగ ఆచూడాలి. అలాగే ఏకపక్షంగా వెళ్లిన మోడీకి కూడా ఓటమి ఎలా ఉంటుందో రుచి చూపారు. గత ఐదేళ్ల పాలనా అనుభవాలను దృష్టిలో పెట్టుకొని కెసిఆర్, జగన్‌లు తమ విధానాలు మార్చుకోవాలి. పాశ్చాత్తాపం ప్రకటించాలి. చేసిన తప్పులకు పడే శిక్షలకు సిద్దంగా ఉండాలి. అధికారంలో ఉండగా చేసిన తప్పులకు శిక్షలు పడాలి. అవి త్వరగా నిర్ధారణ కావాలి. లోక్‌పాల్ వంటి వ్యవస్థను ఏర్పాటు చేస్తేనే పాలకుల అవినీతిని అరికట్టగలం. వ్యవస్థను గాడిలో పెట్టుకోగలం.

## వ్యాసకర్తలకు వినతి

రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై వ్యాసాలు పంపేవారు మీ వ్యాసాలను వీలైనత క్లుప్తంగా, వివరణాత్మకంగా, 350-400 ల పదాలకు పరిమితం అయి ఉండేలా చూడండి. పెద్ద వ్యాసాలను పరిశీలించనడం సాధ్యం కాకపోవచ్చని గ్రహించగలరు. వర్డ్ డాక్యుమెంట్, లేదా ఓపెన్ ఫైల్ లో, ఈ మెయిల్ కు మాత్రమే పంపగలరు.

mantalukathalu@gmail.com

-ఎడిటర్

## తోడు...అవశ్యమైనది

మనిషికి మానవత్వం తోడైతే...
ఆ మనిషి వ్యక్తిత్వం ఉత్తమమైనది
ఆ మనిషి జీవితం ఆరోగ్యమైనది

కుటుంబానికి ఐక్యత తోడైతే...
ఆ కుటుంబం ఆదర్శమైనది
వంశానికి కీర్తి తోడైతే...
ఆ వంశం ఘనమైనది

భక్తికి ఆత్మశుద్ధి తోడైతే...
ఆ భక్తి దైవికమైనది
శిష్యుడికి సద్గురువు తోడైతే...
ఆ శిష్యుడి భవిష్యత్తు నిర్బయమైనది

విద్యాలయాలకు సమాజ సేవ తోడైతే...
ఆ విద్యాలయాల భావజాలం శ్రేష్టమైనది
విద్యకు వినయం తోడైతే...

ఆ విద్య పరిపూర్ణమైనది
విద్యార్థులకు గురు వాక్క తోడైతే...
బిడ్డలకు తల్లిదండ్రుల అనుభవం తోడైతే...
ఆ బిడ్డల భవిష్యత్తు క్షేమమైనది

సమాజానికి విలువలు తోడైతే...
ఆ సమాజం నైతికమైనది
నాయకత్వానికి ప్రజాసేవ తోడైతే...
ఆ నాయకత్వం మార్గదర్శమైనది

పరిపాలనకు ప్రజా క్షేమం తోడైతే...
ఆ పరిపాలన ప్రజారంజకమైనది
దేశానికి ప్రజా ఐక్యత తోడైతే...
ఆ దేశం శక్తివంతమైనది

ఆ స్నేహం పటిష్టమైనది
స్నేహానికి నమ్మకం తోడైతే...
ప్రకృతికి మానవ సంరక్షణ తోడైతే...
ఆ ప్రకృతితో జీవనం మనోహరమైనది

భార్యాభర్తలు ఒకరికొకరు తోడైతే...
ఆ భార్యాభర్తల జీవిత ఆనందమైనది
జీవితానికి ఏ తోడు లేకపోతే...
ఆ జీవితం అసంపూర్ణమైనది

ననుబోలు రాజశేఖర్,
పెద్ద తాడేపల్లి,






## అందరికీ ఒకటే న్యాయం

సోమ సేన మహారాజుకు ఇద్దరు కుమారులు వారిని చిన్న వయస్సు నుండి చాలా అన్యన్యంగా పెంచాడు.

ఎదుటి వారి సొత్తుకు ఆశపడవద్దని, సోమరి తనం పనికిరాదని చెబుతుండేవాడు. తన కుమారులకు ఇద్దరికీ ప్రత్యేకంగా కాకుండా అందరితో పాటుగా గురుకులంలో చేరి విద్యను నేర్చుకొనేలా చేశాడు.

రాకుమారులు పెరిగి పెద్దవారై తండ్రి తరువాత రాజ్య భారాన్ని తాము మోయాలని నిర్ణయించుకున్నారు.

ఒకరోజు సోమ సేనుడు తన సేనాడిపతితో కలసి వేటకు బయలుదేరాడు. పగలు గడిచింది ఆయన కోటకు చేరుకోలేదు.చీకటి పడింది కాబట్టి ఎక్కడో ఒక చోట సురక్షితంగా ఉంటాడు అనుకున్నారు అందరు.

ఇలా రెండు రోజులు గడిచిపోయింది వేగులు" ప్రభు అడవిలో రాజుగారు వేసుకొన్న వస్త్రాలు ఒక పశువుల కాపరి వేసుకొని తెరుగుతుంటే పట్టుకొని ప్రశ్నించాము అది వాడికి అడవి మధ్యలోనున్న మునుల బావి దగ్గర దొరికిందని చెప్పాడు" అన్నారు.

విషయం చెవినపడిన వెంటనే ఇద్దరు రాకుమారులు సర్వ సైన్యముతో అడవిలో వారు చెప్పిన ప్రదేశానికి వెళ్ళారు అక్కడ వారికి ఎటువంటి ఆనవాళ్ళు కనిపించలేదు. పక్కనే ఉన్న ముని వాటికకు వెళ్ళారు అక్కడ రాజుగారు , సైన్యాధిపతి ఇద్దరు కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ ఉన్నారు.

"మేము మీకోసం ఎంత ఆవేదన చెందామో తెలుసా?

మీరేమో ఇక్కడ కులాసాగా ఉన్నారు. మాకు మీరు క్షేమంగా ఉన్నట్లు కబురు పెట్టి మీరు ఇక్కడ కాస్త విశ్రాంతి తీసుకొని ఉంటే బాగుంటుంది " అన్నారు ఇద్దరు కుమారులు.

"నేను మీకు ఇది వరకే చెప్పాను సోమరి తనం పనికిరాదని, నేను కనపడక పోయిన రోజు రాత్రి మీరు నన్ను వెతికి ఉంటే నేను నిజంగా ఆపదలో ఉన్నప్పుడు కాపాడి ఉండేవారు. అలా కాదని రెండు రోజులు ఆగి వెతకడం మొదలు పెట్టారు అది కూడా వేగులు మీకు నా బట్టలు తెచ్చి ఇవ్వడం వల్ల , అందుకే ఏ సమయం ఎలాంటి ఆపద వస్తుందో తెలియదు.కాబట్టి మీరు నిరంతరం అప్రమత్తతతో ఉండాలని ఇలా చేసాను " అన్నారు.

ఒక రోజు సభ మధ్యలో ఇద్దరు రైతులు తమ భూ సమస్య పరిష్కరించ వలసినదిగా వేడుకున్నారు. అందుకు వారి వాదనలు విన్న రాజుగారు.మీ సమస్యను మా కుమారులు నేరుగా భూమి పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటారని చెప్పి , వారితో పాటు తన కుమారులను పంపించారు. అక్కడ తగాదాలో పరిష్కారం కానీ భూమిని రాజుకు రాసివ్వవలసినదిగా తీర్పు చెప్పి వచ్చేసారు. మరుసటి దినం రాజు గారి వజ్రాల హారం దొంగలించారన్న నెపంతో ఒక బటున్ని సభలో ప్రవేశ పెట్టారు, అందుకు శిక్ష రాకుమారులు విదిస్తారని అన్నారు రాజు.

ఇతరుల సొమ్ము ఆశ పడటం తప్పు అని మా తండ్రి గారు ఎప్పుడూ చెబుతుంటారు.అలాంటిది వారి సొమ్ము కజేయడం నేరం కాబట్టి ఇతనికి కారాగార వాసం విధించండి అన్నారు ఇద్దరు. అందుకు నేరం మోపబడిన వ్యక్తి "అయితే ప్రభువులు మన్నించాలి నాతో పాటు రాకుమారులు కూడా కారాగార వాసం అనుభవించాలి " అన్నాడు.

అందుకు అక్కడున్న వారితో పాటు రాకుమారులు కూడా అవాక్కయ్యారు. "కారణం?" అన్నారు రాజు గారు గట్టిగా , "నిన్న తమ కుమారులు తగువు తెంచమని పంపితే, వారి పూర్వీకుల ఆస్తిని రాజు సొంతం చేసుకోవడం తప్పు కాదా ?" అన్నాడు ఆ వ్యక్తి.

నిన్న తాము చేసిన తప్పు తెలుకున్న రాకుమారులు , తన తండ్రి తమకు జ్ఞానోదయం కలిగించడం కోసం ఇలా చేసి ఉంటాడని గ్రహించి అప్పటి నుండి ఎటువంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకోకుండా రాజ్య పాలన చేయసాగారు.

సింగంపల్లి శేష సాయి కుమార్
రాజంపేట, 8639635907

# రాజకీయ వికృత రూపనికి మూలం
# ఆశ్రిత పెట్టుబడి విధానాలేనా ?



సిహెచ్ వి ప్రభాకర్ రావు.
సీనియర్ జర్నలిస్ట్. 9391533339

మారుతున్న రాజకీయాలలో సిద్ధాంతాలకన్నా, స్వంత లాభలకే ఎక్కువ ప్రాధాన్యత లభిస్తుంది. జాతీయ స్థాయి నిదని స్థానిక సంస్థల వరకు రాజకీయాలన్నీ డబ్బు చుట్టే తిరుగుతున్నాయి. ఎవరు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది. పార్టీలు చెప్పే సిద్ధాంతాలను ఒక చెవితో విని, మరొ చెవితో విడిచిపెట్టే నాయకులే ఎక్కువగా తయారౌతున్నారు. ఒకనాడు సిద్ధాంతలకే కట్టుబడి, దశాబ్దాలపాటు ప్రతిపక్షంలో ఉన్న బిజేపి కూడా అధికారమే పరమావధిగా భావిస్తూ, గత దశాబ్దంగా మిగతా అన్నీ రాజకీయ పార్టీలలా, అన్నీ రకాల ఆలోచనలతో ఉన్న నాయకులను తనలోకి ఆహ్వానిస్తుంది. 2014 లో అధికారంలోకి వచ్చిన తరువాత, కాంగ్రెస్ రహిత భారత దేశం అన్న నినాదాన్ని ప్రకటించింది. కానీ అస్సాం నుండి గుజరాత్ వరకు, కాశ్మీరీ నుండి కన్యాకుమారి వరకు కాంగ్రెస్ నాయకులను చేర్చుకొని, ముఖ్యమంత్రి లాంటి ఉన్నత పదవులను కట్టబెట్టడం వెనుక ఉన్న రహస్యం అందరికీ తెలిసిందే. ఒక కాంగ్రెస్ పార్టీ అని కాకుండా, తృణమూల్ కాంగ్రెస్, జాతీయ కాంగ్రెస్, శివసేన, రాష్ట్రీయ జనతా దళ్ లాంటి అనేక ప్రాంతీయ పార్టీల నాయకులను చేర్చుకొని, అధికారంలో భాగస్వామ్యం చేసింది.

ఇక రాష్ట్ర స్థాయిలో, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బొటాయబోటి మెజారిటీతో అధికారంలోకి రావడంతో, బిజేపి, భారతీయ రాష్ట్ర సమితి కలిసి ఎక్కడ తమ ప్రభుత్వాన్ని పడగొడతాయో నే భయాన్ని బహిరంగంగానే వెల్లదీస్తూ, బి ఆర్ ఎస్ పార్టీకి చెందిన దాదాపు 11 మంది ఎమ్మెల్యేలను తమ పార్టీలో చెరహుకవండి. మరో 5 మంది ఎమ్మెల్యేలను చేచుకొని, భారతీయ రాష్ట్ర సమితి శాసన సభాపక్షాన్ని తమలో విలీనం చేసుకొని, పార్టీ మారితే వేటు పడే సంశయనుండి బయట పడడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తుంది. నిజానికి కాంగ్రెస్ ప్రయత్నం నామ మాత్రంగా ఉన్నా, అధికారం లేకుంటే తమ రాజకీయ వ్యాపారాన్ని నిర్వహించలేని ఎమ్మెల్యేలు అందరూ ఎప్పుడు అధికార పార్టీ కాంగ్రెస్ లో చేరుదామా అని చకోర పక్షుల్లా ఎదిరి చూస్తున్నారు.

తాము గెలిచిన పార్టెకి విధేయులుగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు ఎందుకు గెలిచిన నెలల వ్యవధిలోనే పార్టీలు మారి అధికారా ఛత్రంలోకి మారుతున్నారో అందరికీ తెలిసిందే. రాజకీయం ఇప్పటి పరిస్థితులలో పూర్తిగా వ్యాపారం అయిపోయింది. ఒక శాసన సభ్యుని ఎన్నికకు దాదాపు 10 నుండి 15 కోట్ల వరకు ఖయచ్చు చేయాల్సిన పరిస్థితి ఉందనే విషయం అందరికీ తెలిసిందే. పైసలు ఇవ్వనదే కార్యకర్తలు కూడా రాణి ఈరోజుల్లో, కోట్లు సంపాదించుకొంటున్న ఎమ్మెల్యేలను చూసి ప్రజలు కూడా డబ్బులు ఇస్తేనే ఓటు వేస్తామనే దుస్థితికి దిగజారారు. అంటే ప్రజలను తప్పు పపట్టాల్సిన పని లేదు. ఎన్నికైన రోజు నుండి ఒక్క రోజు కూడా తన నియోజక వర్గ ప్రజల బాగోగులు, ప్రాంత అభివృద్ధిని పట్టించుకోని నాయకుడు, రెండు మూడేళ్లలోనే వందల కోట్లు గడించడం, వందలాది ఎకరాల భూములు కొనుగోలు చేసి, ఫామ్ హౌస్ లు కాటుకోవడం చూసిన ప్రజలు అదే దారిన వెళు తున్నారు.

ఈనాటి పరిస్థితికి మన దేశ ఆర్థికవిధానలే కారణం అనే వారు లేకపోలేదు. ఆర్థిక సరళీకరణ తరువాత, పెట్టుబడిదారుల కనుసన్నలలో ప్రభుత్వాలు నడవడంతో, పెట్టుబడిదారులు ప్రభుత్వ విధానాలను నిర్ణయించే స్థాయికి చేరడంతో రాజకీయాలు కూడా వ్యాపారంలా మారిపోయాయి. గతంలో వ్యాపారస్తులు, పెట్టుబడిదారులు రాజకీయాలలో ప్రత్యక్షంగా కాకుండా, పరోక్షంగా రాజకీయ పార్టీలకు వెనుక ఉండి తమ అవసరాలకు అనుగుణంగా నాడుచుకొనేవారు. కానీ గత రెండు దశాబ్దాలుగా, ప్రత్యక్ష రాజకీయాలలో పాల్గొంటూ, తమకు అనుకూలమైన పార్టీలను గద్దెనెక్కియించడానికి వేలాది కోట్ల నిధులు సమకూరుస్తున్నారనే బహిరంగ రహస్యమే.

దానితో ఆశ్రిత పెట్టుబడిదారుల సంఖ్య పెరిగిపోయి, మిగతా వారిని ప్రభుత్వాలు పట్టించుకొక పోవడంతో, అన్నీ పార్టీలలోని ప్రజాప్రతినిధులు కూడా అధికార పార్టీలో చేరాలనే ప్రయత్నిస్తున్నారు. అధి నిన్న రాష్ట్రంలో భారతీయ రాష్ట్ర సమితి కావచ్చు నేడు కాంగ్రెస్ కావచ్చు. రెండు ఒకే రీతిలో ఇతర పార్టీల శాసన సభ్యులను తమల్వచేర్చుకొంటున్నారు. ఇదొక తెలంగాణ రాష్ట్రానికే పరిమితం అయిన సమస్య కాదు. దేశంలోని అన్నీ రాష్ట్రాలలో ఉన్న పెద్ద సమస్య. జాతీయ స్థాయిలో కూడా బిజేపి ఇదే పద్ధతి అవలంభిస్తుంది.

గతంలో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉంది, రాష్ట్రాలలో అధికారంలో ఉన్న ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను కూలదోయడానికి రాజ్యాంగంలోని 356 ధికారణాన్ని వాడుకొని, రాష్ట్రపతి పాలన విధించింది. ఇప్పుడు బిజేపి రాజయానగాన్ని పక్కన పెట్టి, ప్రతిపక్ష పార్టీలను చీల్చి, తమ పార్టీ అధికారంలోకి రావడానికి ఉన్న అన్నీ మార్గాలను అవలంభిస్తుంది. ఇందులో నీతి, అవినీతి అనే వాటికి చోటులేదని, నిన్నటి వరకు సిద్దాంతలకు, నైతికతకు కట్టుబడి ఉన్న పార్టీగా చెప్పుకొన్నా, అధికారానికి మించిన పరమాబాధి ఎదిలేదనే రీతిలో వ్యవహరిస్తుంది.

పార్టీ ఫిరాయింపులకు ఆధయుడు హర్యాణకు చెందిన గాయాలాల్. ఇతను 1965 లో ఒకే రోజు మూడుపార్టీలు మారాడు. ఆయన పేరన "ఆయారాం %-% గయారామ్" అనే నానుడి స్థిరపడింది. అలాగే మొదటగా ఫిరాయింపుల చట్టం వెతుకు గురైన వ్యక్తి మిజోరాం కు చెందిన లాల్ దఉహేమా. ఇతను 1988 లో పార్లమెంటుకు, ఆ తరువాత శాసనసభకు అనర్హుడుగా ప్రకటించబడిన మోడీటీ ప్రజాప్రతినిధి. రాజీవ్ గాంధీ అధికారంలో ఉన్న రోజుల్లో, అంటే 1985 లో ఇలాంటి ఆయారామ్ గాయారామ్ ల ఆట కట్టించడానికి పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం తెచ్చారు. దీనికి అనుగుణంగా, రాజ్యాంగలోని అనేక ఆర్టికల్స్ లో మార్పులు తెచ్చినా, అధికారంలో ఉన్న పార్టీలు పార్లమెంట్ లో, శాసన సభలో స్పీకర్ ను అడ్డుపెట్టుకొని, రాజకీయ నాయకుల ఫిరాయింపులను ప్రొత్సహిస్తున్నాయనే విషయం స్పష్టం. పార్టీ మార్పు లేదా ఫిరాయింపు ఫిర్యాదుపై స్పీకర్ ఏళ్ల తరబడి తన నిర్ణయం ప్రకటించకుండా వాయిదా వేయడం సహజం అయిపోయింది. కోర్టులు ఎన్నిసార్లు జోక్యం చేసుకొన్నా, ఎన్ని సూచనలు చేసినా, తమ మాతృ పార్టీకి లబ్ది చేకూరేలా, ప్రభుత్వ పెద్దల ఆలోచనలకు అనుగుణంగా మెలగడమే స్పీకర్లకు శిరోధార్యమైపోయింది.

రాజ్యాంగం అనేది ఉన్నదని,దానికి అనుగుణంగా నాడుచుకోవాలనే సోయి ఈ ప్రభుత్వాలకు లేకవడం, రాజకీయాలు అన్నీ కార్పొరేట్ వ్యాపారాల స్థాయికి చేరిపోవడం, ఉద్యోగాలు లేక రోడ్ల పై ఉన్నయువతకు రాజకీయాలు తాత్కాలిక ఉపాధి అవకాశాలు కల్పించడం మరి ధారుణం అయిపోయింది. దశ-దిశ లేని యువత ను సరియైన మార్గాన నడిపే విద్యాసంస్థలు, విద్యావేత్తలు లేకపోవడమే రాజకీయ నాయకుల, పార్టీలకు కలిసి వస్తుంది. విద్యాసంస్థలలో ఉన్నలోపాల వల్ల, వాటి ప్రైవేటీకరణ వల్ల వస్తున్న వికృత రూపలే ఈనాడు రాజకీయాలలో కనబడుతున్నాయి రాజకీయ రంగ ప్రక్షాళనకు విద్యావ్యవస్థ ప్రక్షాలనే ఒక మార్గం కావాలి. ఆశ్రిత పెట్టుబడిదారి విధానాలను ప్రభుత్వాలు అవలంభించినన్నాళ్ళు ఈ దుస్థితి తప్పదు.



# ఎజెండాలోని 30 అంశాలకు కౌన్సిల్ ఆమోదం

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్

జనగామ జూలై 23 (ప్రజామంటలు):
జనగామ జిల్లాలోని మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం మునిసిపల్ ఛైర్పర్సన్ పోకల జమున ఆధ్వర్యంలో పురపాలక సంఘ కాన్ఫరెన్స్ హాల్ లో కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మాట్లాడుతూ.. శానిటేషన్, వీధి దీపాలు, వీధి కుక్కల బెడద, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనాలు, తదితర పలు అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. అదే విధంగా మొత్తం (22 అంశాలు ం 8 టేబుల్ ఎజెండా, మొత్తం = 30) ఎజెండా అంశాలను ప్రవేశపెట్టగా, 30 అంశాలను కౌన్సిల్ ఆమోదించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏఈ మహిపాల్ యాదవ్, వైస్ ఛైర్మన్ మేకల రాంప్రసాద్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ మెంబర్లు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నిర్దేశించిన మెనూ ప్రకారం చిన్నారులకు ఆహారం అందించాలి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ జూలై 23 (ప్రజామంటలు):
జనగామ జిల్లా కేంద్రంలోని కోర్టు వద్ద గల మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న బాల సదనాన్ని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాల సదనంలోని అన్ని గదులను పరిశీలించి, పిల్లలకు అందిస్తున్న ఆహారం, అలాగే వారికి అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాలను పర్యవేక్షించి, విధులను సక్రమంగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. నైట్ వాచ్ మెన్ తప్పనిసరిగా సాయంత్రం 4 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు బాలసదనంలో ఉండాలన్నారు. నిర్దేశించిన మెనూ ప్రకారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించాలని సదనం సూపరిం టెండెంట్ ను ఆదేశించారు. మెడికల్ ఆఫీసర్ నెంబరు, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్, ఇతర ఎమర్జెన్సీ నెంబర్లు అన్నీ కూడాను డిస్ప్లే చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, బాలసదనం బిల్డింగ్ పెండింగ్ మరమ్మతులన్నీ పూర్తి చేయించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట జిల్లా సంక్షేమ అధికారిణి జయంతి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రవికాంత్, ఎఫ్ఆర్వో రాజు, బాలసదనం సూపరింటెండెంట్ వేరోనిక, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ గా కే. ఇందిర బాధ్యతల స్వీకరణ

సికింద్రాబాద్, జూలై 23 (ప్రజామంటలు):
గాంధీ మెడికల్ కాలేజీ నూతన ప్రిన్సిపాల్ గా డాక్టర్ కే.ఇందిర మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ కు చెందిన ఇందిర ఉస్మానియాలో ఎంబీబీఎస్ పూర్తి చేసి, గాంధీ మెడికల్ కాలేజీ లో 1996 నుంచి 1999 వరకు ఫార్మాకలాజీ లో ఎండీ చేశారు. ఉస్మానియా ఆసుపత్రిలో గైనకాలజీస్ట్ గా పనిచేశారు. 2011 నుంచి 2015 వరకు గాంధీ మెడికల్ కాలేజీ లో ఫార్మా కలాజీ ప్రొఫెసర్ గా పనిచేశారు. అనంతరం 2015 లో నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ గా వెళ్ళిన డాక్టర్ ఇందిర ఇప్పుడు గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ గా వచ్చారు. ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపాల్ రమేశ్ రెడ్డి యాదాద్రి భువనగిరి ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ గా వెళ్ళారు. గాంధీ మెడికల్ స్టూడెంట్స్కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చక్కటి వైద్య విద్యను అందించడానికి కృషి చేస్తానన్నారు.



# తెలంగాణ రైతాంగ పోరాట వీరుడు దొడ్డి కొమరయ్య చరిత్ర తో సినిమా



జనగామ జూలై 23 (ప్రజామంటలు):
తెలంగాణ ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం అమరుడైన దొడ్డి కొమురయ్య జీవిత చరిత్ర ఆధారంగా దొడ్డి కొమురయ్య సినిమాను నిర్మిస్తున్నామని, ఆయన పోరాట ప్రతిభను ప్రపంచానికి తెలిసేలా సినిమా తీయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని సినిమా దర్శకుడు సేనాపతి తెలిపారు. మంగళవారం కురుమవాడలోని కురుమ సంఘం భవనం లో సినిమా నిర్మాణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా చైర్మన్ బాల్దె మల్లేశం అధ్యక్షత వహించారు. సందర్భంగా దర్శకుడు సేనాపతి మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం అంటూ తెలంగాణ ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం తన ప్రాణాన్ని అర్పించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య చిత్రాన్ని అన్ని కుల సంఘాల సహకారంతో నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. ప్రతి జిల్లా నుండి 30 మంది సహ నిర్మాతలకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దొడ్డి కొమరయ్య చరిత్రను సమాజానికి తెలియజేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటి జిల్లా చైర్మన్ బాల్దే మల్లేశం మాట్లాడుతూ జిల్లాలోని అన్ని కుల సంఘాలతో సమావేశం ఏర్పాటు చేశామని, అన్ని కులాల సహజత్వాన్ని చిత్రంలో ప్రదర్శించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కర్రె శ్రీనివాస్ మాట్లాడుతూ.... అన్ని కులాలు, మతాలను ఏకతాటిపైకి తెచ్చి దొడ్డి కొమరయ్య సినిమా తీయడమనేది ఒక చరిత్ర అన్నారు. ఈ సందర్భంగా సినిమా నిర్మాణానికి గాను సహ నిర్మాతలుగా రాపోతుల యాదగిరి (గిరి), నల్ల యాదగిరి, దిగోజు సాంబయ్య చారి, శాలివాహన కుమ్మరి సంఘం, ఐల రాములు చేరారు. అనంతరం జిల్లా కమిటీ ఎన్నుకున్నారు. జిల్లాకో చైర్మన్గా దిగోజు నరసింహ చారి, జిల్లా కన్వీనర్ గా రాపోతుల యాదగిరి (గిరి), జిల్లా కో కన్వీనర్ గా నిడికొండ రాములు, కమిటీ సభ్యులుగా మైలారం వెంకటేశం ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం జనగామ జిల్లా కార్యదర్శి, జాయ మల్లేష్,రామగిరి సోమేశ్, జూకంటి శ్రీశైలం, కెమిడి ఉపేందర్, కడకంచి మధుసూదన్, ఎంద్రివైకుంఠం, కౌడి శీను, దయ్యాల శ్రీను, మంగ బాలరాజు, మంగ రామకృష్ణ తదితర కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం దొడ్డి కొమురయ్య సినిమాలో నటించేందుకు గాను నటీ నటులను ఎంపిక చేశారు. దొడ్డి కొమరయ్య సినిమా డైరెక్టర్, ఎం. సేనాపతి, 9866654877, బాల్దే మల్లేశం దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటీ జిల్లా చైర్మన్ 9848237069.

# వచ్చే రాష్ట్ర బడ్జెట్లో బీసీలకు 50 శాతం బడ్జెట్ కేటాయించాలి



జగిత్యాల జులై 23 (ప్రజామంటలు):
జిల్లా కేంద్రంలో జరిగిన బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈనెల 25 న ప్రవేశపెట్టనున్న రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్లో బీసీలకు 50 శాతం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేస్తుంది అని తెలిపారు. గత సంవత్సర కాలంగా రాష్ట్ర వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా బిసి ల ప్రధాన అంశం అయినటువంటి కుల గణన ప్రక్రియ చేపట్టి, జనాభా దామాషా ప్రకారం బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని తమ ప్రధాన ఎజెండాగా ప్రకటించి దాదాపు 8 నెలలు కావస్తున్నదని, కానీ ఈ ప్రభుత్వం ఇంతవరకు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని, అదేవిధంగా ఈ ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపిస్తే మా ఓట్లతో గెలిచి వారి మేనిఫెస్టోలో బీసీలకు పెద్దపీట వేస్తామని రిజర్వేషన్లు కల్పిస్తామని ఇంతవరకు ఒక్క హామీ నెరవేర్చలేదు, మరియు అసెంబ్లీలో కేవలం తీర్మానం మాత్రమే ప్రవేశపెట్టి ఎలాంటి చర్యలు తీసుకోకుండా గత ఎనిమిది నెలలుగా ఎందుకు జాప్యం చేస్తున్నారని బీసీ సంఘం డిమాండ్ చేస్తుంది. ఇలాంటి హామీలు గత ప్రభుత్వం కూడా ఇలాగే ప్రకటించి కేవలం తీర్మానం మాత్రమే ప్రవేశపెట్టి చేతులు దులుపుకుందని, కేవలం హామీలు ఇచ్చి కాలం వృధా చేసిన ఈ ప్రభుత్వం కూడా ఇలాగే స్థానిక సంస్థల్లో వాటా రాకుండా చేయాలని జాప్యం చేస్తున్నారని, బీసీ లకు అన్యాయం చేస్తున్నారని కాబట్టి ఇప్పటికైనా ఈ రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి, రాబోయే రాష్ట్ర బడ్జెట్ లో బీసీలకు అధిక శాతం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేస్తుంది. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరిస్తోంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, సంయుక్త రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ అలిశెట్టి ఈశ్వరయ్య, బిసి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, బి.సి యువజన సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుపురం రాంచందర్, బి.సి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మారిశెట్టి సూర్యప్రకాష్, బి.సి సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షురాలు బండపెల్లి మల్లీశ్వరి, బిసి సంక్షేమ సంఘం పట్టణాధ్యక్షుడు రాపర్తి రవి, యూత్ కో-ఆర్డినేటర్ హృషికేష్, ముద్దం గంగారెడ్డి, బిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ లను బీసీ డీ నుంచి

# బీసీ ఏ లోకి మార్చాలి

## సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేయాలి

## రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్

సికింద్రాబాద్ జూలై 23 (ప్రజామంటలు):
ముదిరాజ్ కమ్యూనిటీని బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను తెలంగాణ ప్రభుత్వం ఏ మాత్రం జాప్యం చేయకుండా వెంటనే అమలు చేయాలని ముదిరాజ్ రాష్ట్ర మహాసభ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ డిమాండ్ చేశారు. బోయిగూడ లోని రాష్ట్ర ముదిరాజ్ భవన్ లో జరిగిన రాష్ట్రంలోని 33 జిల్లాల ముదిరాజ్ మహాసభ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ....రాష్ట్రంలోని అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ల సామాజిక పరిస్థితిని పరిశీలించి, గత 15 ఏండ్ల క్రితం అప్పటి సీఎం దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముదిరాజ్ లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చుతూ జీవో నెం. 15 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారన్నారు. కాని కొందరు కోర్టుకు వెళ్ళడంతో అమలులో జాప్యం జరిగిందన్నారు. దీనిపై ముదిరాజ్ మహాసభ కోర్టుకు వెళ్ళడంతో సుప్రీం కోర్టు తమకు అనుకూలంగా తీర్పు చెప్పిందన్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి బీసీ డిక్లరేషన్, అభయ హస్తం మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే జీవో నెం 15ను అమలు చేయాలన్నారు. ముదిరాజ్ కార్పొరేషన్ కు ప్రతి ఏటా ఒక వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. ప్రభుత్వ జీవో ప్రకారం చెరువు, కుంటలపై మత్స్య సంపదపై తెనుగు, ముత్తరాశి, ముదిరాజ్, బెస్త, గంగపుత్ర, గూండ్ల కులాలకు మాత్రమే హక్కులు కల్పించాలన్నారు. ముదిరాజ్ లకు ఫించన్లు ఇవ్వాలన్నారు. ఆరు వేలకుపైగా ఉన్న అన్ని సొసైటీలకు ఉచితంగా చేప పిల్లలను చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ముదిరాజ్ నాయకులు జగదీశ్ ప్రసాద్, చెన్నంగి వెంకటేశ్, డి.సదానందం, చెన్నయ్య, శారధ, సురేందర్, శ్రీకాంత్, పొట్లకాయల వెంకటేశ్వర్, మెట్టగాడి శ్రీనివాస్, చంద్రమౌళి, ప్రకాశ్, నరేశ్ లతో పాటు 33 జిల్లాల నుంచి వచ్చిన ముదిరాజ్ సంఘాల జిల్లాల అధ్యక్షులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



# బిజెపి ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు తీవ్రమైన అన్యాయం

## ఎంఎల్ పిఐ రెడ్ ఫ్లాగ్ జనగామ జిల్లా కార్యదర్శి మాన్యపు భుజేందర్



జనగామ జూలై 23 (ప్రజామంటలు):
బిజెపి ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు తీవ్రమైన అన్యాయం జరిగిందని, బిజెపి పక్షపాత వైఖరిని ప్రజాస్వామ్యవాదులు ముక్తకంఠంతో ఖండించాలని ఎం ఎల్ పి ఐ రెడ్ ఫ్లాగ్ జనగామ జిల్లా కార్యదర్శి మాన్యపు భుజేందర్ కోరారు. పార్లమెంటులో ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ పై భుజేందర్ ఒక ప్రకటనలో స్పందించారు. విభజన హామీలు విఫలమయ్యారని, వెంటనే కేంద్ర మంత్రులు, బిజెపి పార్లమెంటు సభ్యులు రాజీనామా చేయాలని ఎం ఎల్ పి ఐ రెడ్ ఫ్లాగ్ పార్టీ డిమాండ్ చేస్తుందని అన్నారు.

# తెలంగాణకు అన్యాయం చేసిన కేంద్ర బడ్జెట్



హైదరాబాద్ జూలై 23 (ప్రజామంటలు):
తెలంగాణ పదమే లేని అన్యాయమైన బడ్జెట్ ఇదనీ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నగేష్ ముదిరాజ్ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కు జాతీయహెూదా లేదు. విభజన హామీలో పొందుపరిచిన బయ్యారం హక్కు ప్రాజెక్ట్ కి నిధులు కేటహించకపోవడం అన్యాయం. తెలంగాణకు నిధులు రాభాటడం లో రాష్ట్రకాంగ్రెస్ ప్రభుత్వం విపలం చెందింది. బడ్జెట్ విషయంలో బిజెపి తెలంగాణాకి ఎంత మోసం చేసిందో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అంతే మోసంచేసింది. ముఖ్యంగా రైతులకి వ్యవసాయ రంగానికి నిధులు కేటహించక తీరని నష్టం చేసింది. 48 లక్షల కోట్ల బడ్జెట్ లో తెలంగాణాకు ఇచ్చింది పెద్ద గుండు సున్న అని నాగేష్ ముదిరాజ్ విమర్శించారు.

# సఖి అవగాహన సదస్సు



ఎల్కతుర్తి జులై 23 (ప్రజామంటలు):
హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని దామెర గ్రామంలో సిసి శ్రీనివాస్ యొక్క సమక్షంలో గ్రామ సభ యందు సఖి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సఖి యొక్క ముఖ్య ఉద్దేశాలు అందించిన సేవలను తెలియజేయుటకు సఖి సెంటర్ కేస్ వర్కర్ అయినటువంటి వెన్నెల హరిత పాల్గొని సఖి సెంటర్ యొక్క ముఖ్య ఉద్దేశాలు అందించిన సేవలను వివరించడం జరిగింది ఐదు రకాల సేవలను గురించి తెలుపుతూ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది కౌన్సిలింగ్ సహాయం వైద్య సహాయం పోలీస్ సహాయం తాత్కాలిక వసతి న్యాయ సహాయం ఐదు రకాల సేవలను గురించి తెలుపుతూ చట్టాలపై ప్రతి ఒక్క మహిళలకు అవగాహన ఉండాలని చెప్పడం జరిగింది. సఖి సెంటర్ యొక్క ముఖ్య ఉద్దేశాలు తెలుపుతూ గృహ హింస లైంగిక వేధింపులు పనిచేసేచోట వేధింపులు అత్యాచారాలు ఇలాంటి రక్షణ పొందడానికి సఖి సెంటర్ పనిచేస్తుందని చెప్పడం జరిగింది సఖి సెంటర్ సిబ్బంది 24 గంటలు పని చేస్తామని సమస్య ఉన్నప్పుడు 181 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయడం ద్వారా తక్షణ సహాయం రక్షణ లభిస్తుందని అదేవిధంగ 08702452112 అనే నెంబర్ కి కాల్ చేయడం ద్వారా సహాయం బాధిత మహిళలకు సహాయం అందించ బడుతుంది అని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఏలు మహిళా గ్రూపు నాయకురాలు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.



అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, మంత్రి కొండ సురేఖ, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ లను మర్యాద పూర్వకంగా కలిసిన ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్






## గుట్కా పాకెట్లు పట్టుకున్న ఎస్ఐ హరిత

వేలేరు జూలై 23 (ప్రజామంటలు):
వేలేరు మండలం పీచర గ్రామంలో పక్క సమాచారంతో 3788 రూపాయల విలువ గల గుట్కా పాకెట్స్ పీచర్ గ్రామానికి చెందిన రాగి సంతోష్ తండ్రి లక్ష్మయ్య మరియు మారబోయిన అశోక్ తండ్రి బాలయ్య వద్ద నుండి సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వేలేరు ఎస్సై హరిత తెలిపారు. మండలంలో ఎవరైనా గుట్కా పాకెట్లు అంబర్ పాకెట్లు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు.

## తెలంగాణ కు మొండి చెయ్యి..

### జెడ్పి పూర్వ చైర్ పర్సన్, దావ వసంత సురేష్

జగిత్యాల జులై 23 (ప్రజామంటలు):
కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో రాష్ట్రానికి మొండి చేయి మిగిలింది. తెలంగాణ రాష్ట్రానికి ఈ బడ్జెట్ నిరాశను మిగిల్చింది. తెలంగాణ ప్రస్తావనే లేని బడ్జెట్ గా ఇది చరిత్రలో నిలిచిపోతుంది. రైలు కోచ్ ఫ్యాక్టరి, వ్యవసాయ రంగం ప్రాధాన్యత గురించి బడ్జెట్ లో ప్రస్తావన లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెరో 8 మంది ఎంపీలు ఉన్న తెలంగాణా పై వివక్ష ను ప్రశ్నించకపోవడం శోచనీయం. ప్రజల అభివృద్ధి, రైతుల సంక్షేమం, దేశ భవిష్యత్ కు సంబంధించిన ఒక్క విషయం బడ్జెట్ లో ప్రస్తావన లేదు. ఈ బడ్జెట్ కేవలం రెండు రాష్ట్రాలైన బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సంక్షేమ బడ్జెట్ గా మాత్రమే మిగిలింది. ఈ బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంట్ లో బీఆరెస్ ఎంపీలు లేని లోటు స్పష్టంగా కనబడింది.



## సఖి అందించే ఐదు రకాల సేవలపై అవగాహన కార్యక్రమం



భీమదేవరపల్లి జూలై 23 (ప్రజామంటలు):
మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సిసి, వివో, ఎస్ఎస్సి గ్రూప్ సభ్యుల సమక్షంలో సఖి అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సఖి యొక్క ముఖ్య ఉద్దేశాలు, అందించిన సేవలను సఖి సెంటర్ ప్రతినిధులు హరిత, వినీల సభ్యులకు వివరించారు. సఖి అందించే ఐదు రకాల సేవలను గురించి తెలుపుతూ, ఈ సేవలు సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ మరియు మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించబడతాయని తెలిపారు. కౌన్సిలింగ్, వైద్య, పోలీస్, తాత్కాలిక వసతి, న్యాయ సహాయ సేవలు, చట్టాలపై ప్రతి ఒక్క మహిళలకు అవగాహన ఉండాలని సూచించారు. అంతేకాకుండా గృహ హింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచారాలు లాంటి వాటి నుండి రక్షణ పొందడానికి సఖి సెంటర్ పనిచేస్తుందని తెలిపారు. సఖి సెంటర్ సిబ్బంది 24 గంటలు పని చేస్తారాని, సమస్య ఉన్నప్పుడు 181 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి తక్షణ సహాయం, రక్షణ లభిస్తుందని అన్నారు. అదేవిధంగా 0870-2452112 ద్వారా బాధిత మహిళలకు తక్షణ సహాయం అందుతుందని అన్నారు.

## ముల్కనూర్ సొసైటీ సభ్యులకు 16 కోట్ల, 36.16 లక్షల నగదు పంపిణీ

### రూ. లక్ష లోపు రైతులకు రుణమాఫీ పంపిణీ

### ముల్కనూరు సహకార సంఘం అధ్యక్షుడు అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డి



భీమదేవరపల్లి జూలై 23 (ప్రజామంటలు):
ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పథకంలో భాగంగా ముల్కనూర్ సొసైటీ సభ్యులకు రూ. లక్ష వరకు మాఫీ చేసినట్లు ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం అధ్యక్షులు అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డి తెలిపారు. మంగళవారం ముల్కనూరులోని సహకార సంఘం ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు రుణమాఫీ కింద 2698 సంఘ సభ్యులకు రూ. 16,36,16,094.00 కోట్లు వారి ఖాతాలో జమ చేసి, రుణమాఫీ డబ్బులను నగదు రూపంలో పంపిణీ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఆయనతోపాటు జిల్లా సహకార అధికారి నాగేశ్వరరావు, ముల్కనూరు సహకార సంఘం జీఎం మారుపాటి రాంరెడ్డి, డైరెక్టర్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

### ప్రజా దర్బార్ సద్వినియోగం చేసుకోవాలి

### మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్



జగిత్యాల జులై 23 (ప్రజామంటలు):
ప్రజా సమస్యల పరిష్కారానికి మున్సిపల్ అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. మంగవారం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ కార్యక్రమం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ.... ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ వస్తున్న వినతులకు ప్రాధాన్యత ఇచ్చి నాణ్యతతో పరిష్కరించాలని, పెండింగ్ ఉండకుండా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆదేశించారు. పలు వార్డుల్లో విద్యుత్ దీపాలు, డ్రైనేజీలు, సిసి రోడ్లు గుంతలు సమస్య, విది కుక్కల నివారణ, పారిశుధ్యం పై ఉచిత గ్యాస్ పలు విధుల్లో ఉన్న చెట్లను తొలగించాలని పట్టణ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు స్వీకరించారు. భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్లను బాగు చేసేందుకు, కొత్త రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ఇంజనీరింగ్ విభాగం అధికారులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



అసెంబ్లీలో శాసన సభ వ్యవహారాల మంత్రి దుద్దిల్ల శ్రీదర్ బాబు ను కలిసి, మాజీ శాసన సభ, మండలి సభ్యుల, సమస్యలు వివరించి, పరిష్కరించమని కోరిన మాజీ మంత్రులు జి. రాజేశం గౌడ్, నేరెళ్ళ ఆంజనేయులు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన బిఆర్ఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి



చిగురుమామిడి జూలై 23 (ప్రజామంటలు):
మండలంలోని సీతారాంపూర్ గ్రామానికి చెందిన గోగురి మురహరి రెడ్డి తల్లి గోగురి పోచమ్మ ఇటీవల అనారోగ్యం కారణంతో మృతి చెందిన విషయం తెలుసుకుని హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి మండల అధ్యక్షులు మామిడి అంజయ్యతో కలిసి వారి కుటుంబాన్ని పరామర్శించి వారికీ మనోధైర్యాన్ని చెప్పారు. అనంతరం చిగురుమామిడి మండల కేంద్రంలోని నిన్నటిరోజున ముడికే ఐలయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృత దేహానికి నివాళులు అర్పించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షులు పెనుకుల తిరుపతి, సీతారాంపూర్ గ్రామశాఖ అధ్యక్షులు శ్యామకూర సంపత్ రెడ్డి నాయకులు ముస్కుల సుధాకర్ రెడ్డి, ముస్కుల కృష్ణా రెడ్డి, ఒంటెల ఇంద్రసేన రెడ్డి, ముసాపురి అశోక్, ముక్కెర సదానందం, అనిల్, శ్రీకాంత్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## శాకాంబరి దేవి గా బంగారు మైసమ్మ



సికింద్రాబాద్ జూలై 23 (ప్రజామంటలు):
సికింద్రాబాద్ పార్శీగుట్ట లోని మధురానగర్ కాలనీ శ్రీశ్రీశ్రీ బంగారు మైసమ్మ అమ్మవారి ఆలయంలో ఆషాడ మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆలయంలో అమ్మవారు శాకాంబరి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో వందలాది మంది భక్తులతో పాటు ఆలయ చైర్మన్ గుర్రం పవన్ కుమార్ గౌడ్, కమిటీ సభ్యులు, కాలనీ నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దు చేసే దిశగా కేంద్ర బడ్జెట్

### బికెయంయు రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్



చిగురుమామిడి జూలై 23 (ప్రజామంటలు):
పార్లమెంట్ లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతా రామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే దిశగా కేటాయింపులు జరిగాయని భారత్ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బికెయంయు) రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలను ఆదుకోవడంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కీలక పాత్ర పోషిస్తుందని ఇలాంటి పథకాలకు అరకొరగ కేవలం 88 వేల కోట్ల నిధులను కేటాయించిందని ఇలా చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించడం సాధ్యం కాదని, ఉపాధి హామీ పథకం లక్ష్యం నెరవేరదని అన్నారు.దేశ వ్యాప్తంగా ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతూ బ్రతుకు భారమై కుటుంబ పోషణ కోసమైనా 14 కోట్ల మంది ఉపాధి హామీ జాబ్ కార్డులు కలిగిన కూలీలు ఉన్నారని, ఇదే కాకుండా రోజు రోజుకు కూలీల సంఖ్య పెరుగుతుందని ఇలాంటి పరిస్థితుల్లో బడ్జెట్ కేటాయింపులు రెట్టింపు స్థాయిలో ఉండాలి తప్ప నామ మాత్రంగా పెంచుతే ఉపాధి హామీ కూలీలకు పని దొరుకదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా ఉన్న కష్ట జీవులకు ,వ్యవసాయ కూలీలకు చేతినిండా పని కల్పించాలనే లక్ష్యంతో యుపిఏ ప్రభుత్వం హయాంలో పోరాడి సాధించుకున్న మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ను కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్లో సరిపోను నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తూ పనిలో అనేక ఆంక్షలు పెడుతూ ఉపాధి కూలీలను పనికి దూరం చేస్తూ కోట్లాది మంది పొట్ట గొట్టే విధంగా ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా రద్దు చేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. సంపన్నుల కోసం పని చేసే నరేంద్ర మోడీ ప్రభుత్వం చర్యల వల్ల ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధి హామీ పథకం కోన ఊపిరి లో ఉందని ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేసుకొని ఉపాధి కూలీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని బడ్జెట్ కేటాయింపులు జరుపాలని సృజన్ కుమార్ హితువు పలికారు.

## జగిత్యాల సర్కిల్ పరిధిలో 115 కెపాసిటర్ బ్యాంకుల ఏర్పాటు

### జి. సత్యనారాయణ ఎస్ఈ



జగిత్యాల జులై 23 (ప్రజామంటలు):
వినియోగదారులకు మరింత మెరుగైన , నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించే లక్షంగా జగిత్యాల సర్కిల్ పరిధిలోని సబ్ స్టేషన్ ల లో 115 కెపాసిటర్ బ్యాంకులు పెట్టినట్లు జి. సత్యనారాయణ, సూపెరింటెండింగ్ ఇంజనీర్, జగిత్యాల తెలిపారు . ఇంకను కెపాసిటర్ బ్యాంకులు 2 పెట్టనున్నట్లు వివరించారు. వోల్టేజ్ లో హెచ్చు తగ్గులు లేకుండా ఎంతగానో కెపాసిటర్ బ్యాంకులు ఉపయోగపడుతాయని అన్నారు. కెపాసిటర్ బ్యాంకులు పెట్టడం వలన సబ్ స్టేషన్ , లైన్లలో విద్యుత్ సరఫరాలో ఓవర్ లోడ్ కాకుండా నియంత్రిస్తున్నదన్నారు. సబ్ స్టేషన్ లలో 1. ఎం విఏఆర్, 2. ఎం విఏఆర్ కెపాసిటర్లు పెడుతున్నామని, అలాగే 11 కెవి లైన్లలో 600 కెవిఏ ఆర్ కెపాసిటర్లు 41 అమర్చడం వలన పవర్ ఫ్యాక్టర్ మెరుగు పడుతుందని అన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు, 10 ఎచ్ పి మోటార్ కు 3 కేవి ఏఆర్, 5 ఎచ్ పి మోటార్ కు 2 కేవిఏఆర్, 3 ఎచ్ పి మోటార్ కు 1 కేవిఏఆర్, పారిశ్రామిక సర్వీస్ ల మోటార్ లు కూడా తగిన కేపాసిటీ కలిగిన కేపాసిటర్ లు ఏర్పాటు చేయడం వల్ల, లో వోల్టేజ్ వలన మోటార్లు కాలిపోకుండా ఉండేందుకు కెపాసిటర్ బ్యాంకులు దోహద పడుతాయన్నారు. విద్యుత్ సరఫరా వ్యవస్థలో రీయాక్టివ్ పవర్ కాంపన్సేషన్ ద్వారా పవర్ ఫ్యాక్టర్ ఘననీయంగా మెరుగు పరచడానికి కెపాసిటర్ బ్యాంకులు దోహద పడుతున్నాయని అన్నారు. టెక్నికల్ నష్టాలు ఘననీయంగా తగ్గుతాయని, పరికరాల మన్నిక కూడా చాల కాలం పెరుగుతుందని అన్నారు. పారిశ్రామిక వినియోగదారులకు కెపాసిటర్లు పెట్టుకోవడానికి ప్రోత్సహిస్తున్నా మని అన్నారు. వీటి వలన ట్రాన్స్ఫార్మర్లపై లోడ్ భారం తగ్గి, మోటార్లు కాలిపోకుండా మన్నిక పెరుగుతుందని తెలిపారు.

## గాంధీ సూపరింటెండెంట్ గా సీహెచ్.ఎన్. రాజకుమారి బాధ్యతల స్వీకరణ



సికింద్రాబాద్ జూలై 23 (ప్రజా మంటలు):
గాంధీ ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్ గా డాక్టర్ సీహెచ్.ఎన్. రాజకుమారి మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ సూపరింటెండెంట్ గా పనిచేసిన డాక్టర్ ఎం. రాజారావు యాదాద్రి భువనగిరి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ గా బదిలీ అయి వెళ్ళిన సంగతి విదితమే. హైదరాబాద్ నగరానికి చెందిన డాక్టర్ సీహెచ్ ఎన్ రాజకుమారి1988 లో గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసి, ఆ తర్వాత పీజీ కూడ చేశారు. 1997 లో వరంగల్ కేఎంసీ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా నియమితులయ్యారు. 1998 లో గాంధీలో అసిస్టెంట్ ప్రోఫెసర్ గా పనిచేసి, 2018 నుంచి నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ గా పనిచేస్తూ, అక్కడి నుంచి బదిలీపై ఇపుడు గాంధీ సూపరింటెండెంట్ గా వచ్చారు. పేదలకు వైద్యం అందించే ఆసుపత్రిగా పేరుగాంచిన గాంధీ ఆసుపత్రి లో పేషంట్లకు మరింత మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేస్తానని ఈసందర్భంగా ఆమె పేర్కొన్నారు.



### భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో

## రికార్డు నోటు బుక్స్ పంపిణీ

జగిత్యాల జులై 23 (ప్రజామంటలు):
జగిత్యాల లోని ప్రభుత్వ గర్ల్స్ హై స్కూల్ యందు 9 మరియు 10 వ తరగతి విద్యార్థులు దాదాపు 150 మంది ఆర్థికంగా వెనకబడిన కుటుంబాల నుండి వచ్చారని, వారికి పరీక్షలకు రికార్డు నోటుబుక్స్ అవసరమున్నాయని ఆ స్కూల్ ఉపాధ్యాయులు శ్రీ బోనగిరి దేవయ్య సత్యసాయి సంస్థ సహకారాన్ని కోరడం జరిగింది. భగవానుని అనుగ్రహ ఆశీస్సులతో "శ్రీ సత్యసాయి సేవా సమితి, జగిత్యాల" ఆధ్వర్యంలో భక్తులందరి సహకారంతో రూపాయలు 20,000 తో ఈ రోజు వారికి కావలిసిన 600 పైగా రికార్డు నోటుబుక్స్ ను అందచేయడం జరిగింది, అలాగే తలా రెండు పెన్స్ కూడా అందించడం జరిగింది. భగవానుని ఆశీస్సులతో పిల్లలందరూ చక్కగా చదువుకొని ఉతీర్ణువులు కావాలని, పిల్లలందరికీ మరియు సహకరించిన భక్తులందరికీ సత్యసాయి భగవానుని దివ్య అనుగ్రహ ఆశీస్సులు సంపూర్ణంగా ఉండాలని అందరినీ ఇంట వెంట జంట కంట ఉండి నిత్యం కాపాడాలని మనసారా ప్రార్థిస్తున్నాం. ఇట్టి కార్యక్రమంలో సంస్థ తరపున కన్వీనర్ బట్టు రాజేందర్, కోటగిరి మహేందర్, అమిరిశెట్టి ప్రభు, మహిళా సభ్యులు, అలాగే ఫ్రెండ్స్ కిట్టీ గ్రూప్ సభ్యులు, మరియు స్కూల్ తరపున ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్ 2 తెలంగాణకు మొండి చేయి

### కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, బిజెపి ఎంపీలు రాజీనామా చేయాలి

### బలహీన ప్రధానమంత్రి ఏపీ, బీహార్ సీఎం లకు భయపడి అధిక నిధులు

### బిజెపి పక్షపాత వైఖరిని ఖండించండి

### మాజీ శాసనసభ్యులు, సిపిఐ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు సిహెచ్.రాజారెడ్డి



జనగామ జూలై 23 (ప్రజామంటలు):
దేశ పార్లమెంటులో ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు మొండి చేయి చూపినందుకు, విభజన హామీల సందర్భంగా ఇచ్చిన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ములుగులో ట్రైబల్ యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, అధిక నిధులు రాబట్టడంలో విఫలమై నందుకు వెంటనే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి,బండి సంజయ్, బిజెపి పార్లమెంటు సభ్యులు రాజీనామా చేయాలని సిపిఐ పార్టీ డిమాండ్ చేస్తుందని మాజీ శాసనసభ్యులు సిపిఐ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు సి.హెచ్. రాజారెడ్డి అన్నారు. దేశంలో అన్ని ప్రాంతాలను రాష్ట్రాలను సమానంగా, సమపాళ్ళలో చూడవలసిన దేశ ప్రధాని ఆర్థిక మంత్రులు, ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు భయపడి పదవి కాపాడుకోవడానికి, వారి కోరిన కోరికలు అన్నింటిని బడ్జెట్లో పెద్ద సంఖ్యలో నిధులు కేటాయించడాన్ని, విభజన హామీలో తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన హామీలను పూర్తిగా వదిలేయడాన్ని, బిజెపి రాష్ట్ర నాయకుల తెలంగాణ వ్యతిరేక వైఖరిని రాష్ట్ర ప్రజలు ప్రజాస్వామికవాదులు అర్థం చేసుకోని ఖండించాలని, నిరసన తెలిపాలని అన్నారు.

## తెలంగాణ బడ్జెట్లో తెలంగాణ తొలి, మలిదశ అమరుల కుటుంబాలకు పెన్షన్ తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలంకు నిధులు కేటాయించాలి

జనగామ జూలై 23 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో తెలంగాణ తొలి దశ మలిదశ అమరుల కుటుంబాలకు పెన్షన్, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కోసం నిదులు కేటాయించాలని జనగామలో తెలంగాణ ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్నారు. మంగళవారం జనగామ పట్టణంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన మలిదశ తెలంగాణ ఉద్యమ జనగామ జేఏసీ నాయకుడు వంగ భీమ్ రాజ్, మంతెన మణికుమార్, మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణ తొలి దశ మలిదశ ఉద్యమ అమరుల కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో పెట్టిన అమరుల కుటుంబాలకు వారి తల్లితండ్రులకు భార్యలకు గౌరవ పెన్షన్ ను 25 వేల రూపాయలను అందించాలని, అమరుల కుటుంబాల పిల్లలకు అర్హత ఉన్నవారికి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వంలో గవర్నమెంట్ జాబ్ ఇప్పించాలని, చదువుకునే పిల్లలకు ఉచిత విద్యను అందించేలా చూడాలని అన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని మంజూరు చేసేలా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం సిఎం రేవంత్ రెడ్డి ని కోరారు.





# నిషేధిత పొగాకు ఉత్పత్తులు పట్టివేత

### ఇద్దరు నిందితుల రిమాండ్

భీమదేవరపల్లి జూలై 23 (ప్రజామంటలు):
మండల కేంద్రం క్రాస్ రోడ్డు వద్ద 18 వేల విలువగల నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ముల్కనూర్ ఎస్సై సాయిబాబు తెలిపారు. వివరాల్లోకి వెళితే మంగళవారం భీమదేవరపల్లి క్రాస్ రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, అనుమానాస్పదంగా ఉన్న వాహనాలను ఆపి తనిఖీ చేశారు. టీఎస్ 03 యూఏ 7618 అను ఆటోలో ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామానికి చెందిన కాసగొని యాకయ్య, కందిమల్ల వేణు గోపాల్ అను వారు ప్రభుత్వం నిషేధించిన 20 అంబర్ ప్యాకెట్స్, 25 అనార్ ప్యాకెట్స్, 20 ఆర్ఆర్ ప్యాకెట్స్ ఉన్నట్లు గుర్తించారు. వారిని పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై సాయిబాబు మాట్లాడుతూ, ఎవరైనా ప్రభుత్వ నిషేధిత వస్తువుల వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది రాజిరెడ్డి, నాగేశ్వరరావు, సంపత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయులను నిరాశ పర్చిన కేంద్ర బడ్జెట్

### టిఎస్ యుటి ఎఫ్ జనగామ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రావు



జనగామ జూలై 23 (ప్రజామంటలు): ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ఒపిఎస్ ఊసేలేకుండా నేషనల్ పెన్షన్ స్కీమ్ యాధావిధిగా కొనసాగిస్తామని చెప్పడం ,ఆదాయ పన్నుల స్లాబ్ లో పెద్దగా మార్పులు చేయకపోవడం నిరాశ పర్చిందని టి ఎస్ యు టి ఎఫ్ జనగామ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రావు అన్నారు. విద్యారంగానికి, శిక్షణా ఉపాధి రంగానికి కలిపి లక్షా నలభై ఎనిమిది కోట్ల కేటాయింపు మొత్తం బడ్జెట్ పరంగా చూస్తే 3% మాత్రమేనని, ఇది ఏమాత్రం కూడా చాలదని అన్నారు. బడ్జెట్ ప్రసంగంలో ప్రాథమిక విద్య నుండి యూనివర్సిటీ విద్య వరకు ఒక్కమాట కూడా లేకపోవడం విద్యారంగం పట్ల కేంద్ర వైఖరిని తెలియజేస్తున్నదని , కేంద్ర వైఖరి ప్రైవేట్ రంగానికి ఊతం ఇచ్చేలా ఉందని అన్నారు. ఈ బడ్జెట్ లో తెలంగాణ కు ఒనగూరింది ఏమిలేదని రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న బయ్యారం ఉక్కు ఫేక్టరీ ,కాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీ ఊసే ఎత్తకపోవడం ,ఏ నీటిపారుదల ప్రాజెక్ట్ కూడా నిధుల కేటాయింపు చేయకపోవడం చూస్తుంటే కేంద్ర వైఖరి స్పష్టంగా అర్థం అవుతుందని, ఇది పేదల బడ్జెట్ కాదని, కార్పొరేట్ల బడ్జెట్ లా ఉందని చంద్రశేఖర్ రావు విమర్శించారు.

# ఏపికి బడ్జెట్‌లో వరాల జల్లు

### అమరావతి నిర్మాణానికి 15వేల కోట్లు

### పోలవరం పూర్తికి బడ్జెట్‌లో హామీ



న్యూఢిల్లీ, 23 (ప్రజా మంటలు):
కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఏపీకి వరాల జల్లు కురిపించారు. రాష్ట్రానికి ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. రాజధాని అమరావతికి భారీ ఆర్థిక సాయం ప్రకటించారు. అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అవసరాన్ని బట్టి భవిష్యత్తులో మరిన్ని అదనపు నిధులు ఇస్తామని స్పష్టం చేశారు. అలాగే, పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి పూర్తిగా సాయం చేస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, రైతులకు పోలవరం జీవనాడి అని.. భారత ఆహార భద్రతకు పోలవరం ఎంతో కీలకమైనదని చెప్పారు. అలాగే, హైదరాబాద్ - బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి కూడా ప్రత్యేక నిధులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు నీళ్లు, విద్యుత్, రోడ్లు, హైవేల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అలాగే, రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. ఏపీ విభజన చట్టానికి కట్టుబడి ఉన్నాం. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సాయం చేస్తాం. విభజన చట్టంలో పొందుపరిచినట్లుగా వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ఆర్థిక సాయం అందించడం సహా రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తాం.' అని విత్త మంత్రి పేర్కొన్నారు.

### జిల్లా కేంద్రంలో భారత్ సురక్ష సమితి ఆధ్వర్యంలో

# ఆజాద్ చంద్రశేఖర్ జయంతి వేడుకలు



జగిత్యాల జూలై 23 (ప్రజామంటలు):
జిల్లా కేంద్రంలోని తహసిల్ చౌరస్తాలో మంగళవారం మధ్యాహ్నం 1:00 గంటలకు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలు అలాగే ఆర్ ఎస్ ఎస్ లో పని చేస్తున్న నిషేధాన్ని కేంద్రం ఎత్తివేసిన సందర్భంగా సంబరాలు నిర్వహించారు... ఈ సందర్భంగా చంద్రశేఖర్ ఆజాద్ జయంతి సందర్భంగా అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన భారత్ సురక్ష సమితి నాయకులు.... అనంతం సీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు స్వతంత్ర సమర జ్వాల చంద్రశేఖర్ ఆజాద్ జయంతి జరుపుకోవడం జరిగిందని అన్నారు. మాతృదేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహా యోధుడు చంద్రశేఖర్ ఆజాద్ అని స్వతంత్రమే ఊపిరిగా బతికిన వీరుడు ఆజాద్.. అని అన్నారు. అలాగే ఆర్ఎస్ఎస్ పై గతం కాంగ్రెస్ ప్రభుత్వం నిషేధించిదని. ఇప్పుడు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఎత్తివేయడం జరిగిందని దీంతో భారత్ సురక్ష సమితి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఏసిఎస్ రాజు, సీనియర్ నాయకులూ పుప్పల సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి కాశినాథం, జిల్లా ఉపాధ్యక్షులు వేముల పోచమల్లు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ ఎండి. శామియుద్దిన మాజీ కౌన్సిలర్ బండారి మల్లికార్జున్, ఎడమల వెంకట్ రెడ్డి, గొల్లపెల్లి సత్యనారాయణ గౌడ్, సిరిపురం గంగారం, తోగతి అంజన్న, గాదాసు భూమన్న, వేముల దేవేందర్, జనార్దన్ రెడ్డి, బండి సత్యనారాయణ, మహేష్, సంపత్ రావు, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్లను నిరాశపర్చిన కేంద్ర బడ్జెట్


### - టీ పెన్షనర్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్



జగిత్యాల జూలై 23 (ప్రజామంటలు):
పార్లమెంట్ లో మంగళవారం ప్రవేశ పెట్టిన కేంద్రబడ్జెట్ పెన్షనర్లను తీవ్రంగా నిరాశపర్చిందని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. తమ అసోసియేషన్ గత 8 ఏళ్ళు గా ఉద్యమాలు చేస్తూ పెన్షనర్లను ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలని కేంద్ర ప్రభుత్వం ను కోరామన్నారు. ప్రతి ఏటా పెన్షనర్ల కు ఆదాయపు పన్ను రద్దు చేయాలని కోరుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ లకు రాష్ట్ర వ్యాప్తంగా తమ రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో పోస్ట్ కార్డులపై వినతులు పంపామన్నారు. ప్రతి నెలా ప్రభుత్వం ఇచ్చే గౌరవ భృతి పెన్షన్ పై ఆదాయపు పన్ను విధించడం సరికాదన్నారు. కనీసం పరిమితిని సైతం ఉద్యోగులకు, పెన్షనర్లకు పెంచక పోవడం శోచనీయమన్నారు. పెన్షనర్లను ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు చేసేంత వరకు రాష్ట్ర వ్యాప్తంగా మా అసోసియేషన్ తరపున ఉద్యమాలు కొనసాగుతాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లం విజయ్, కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం, సహాయ అధ్యక్షుడు పి.సి. హన్మంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు వి. ప్రకాష్ రావు, ఎం.డి. యాకూబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు డిండిగాల విట్టల్, కే. సత్యనారాయణ, ధర్మపురి అధ్యక్షుడు కండ్లే గంగాధర్, కోరుట్ల అధ్యక్షుడు పబ్బా శివానందం, జగిత్యాల అధ్యక్షుడు బి. రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# విషాదాంతం అయిన ఎంపిడివో అదృశ్యం

### విజయవాడ ఏలూరు కాలువలో మృతదేహం లభ్యం





విజయవాడ, జూలై 23 (ప్రజా మంటలు)
నరసాపురం ఎంపీడీవో వెంకట రమణారావు అదృశ్యం ఘటన విషాదాంతమైంది. ఆయన మృతదేహాన్ని విజయవాడలోని ఏలూరు కాలువలో లభ్యమైంది. మధురానగర్ రైలు పై వంతెన వద్ద ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది బయటకు తీశారు. ఎంపీడీవో అదృశ్యమై 8 రోజులు దాటినా ఆచూకీ తెలియ లేదు. ఈ నెల 15న ఆయన మధు రానగర్ రైలు వంతెన పైనుంచి ఏలూరు కాల్వలో దూకారు. దీనిపై గత వారం రోజులుగా ఎన్డీఆర్ఎఫ్ బలగాలు, పెన మలూరు పోలీసులు గాలింపు చేపట్టారు. ఏలూరు కాలువను పోలీసులు జల్లెడ పట్టారు. మధురానగర్ పైవంతెన పిల్లర్‌కు చిక్కుకున్న మృతదేహాన్ని గుర్తించారు. దూకిన ప్రదేశానికి కిలోమీటర్ దూరంలోనే లభ్యమైంది. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని చూసి ఎంపీడీవో కుమారులు, ఇతర కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. గత కొద్ది రోజులుగా అదృశ్యమైన పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో మండల వెంకట వెంకటరమణ మృతదేహాన్ని మంగళవారం ఉదయం ఎస్డీఆర్ఎఫ్ బృందం గుర్తించింది. ఏలూరు కాల్వలో తూటికాడ మధ్య ఇరుక్కుని ఉన్న మృతదేహాన్ని వెంకటరమణ మృత దేహంగా పోలీసులు నిర్ధారించారు. దీంతో ఎస్డీఆర్ఎఫ్ బృందం గుర్తించింది.

# స్కూల్ బస్సును ఢీకొన్న లారీ

### తృటిలో తప్పిన ముప్పు

కాకినాడ,జూలై23 (ప్రజా మంటలు):
ప్రైవేటు స్కూల్ బస్సును వెనుక నుండి లారీ డీ కొట్టగా బస్సు వెనుక భాగం పూర్తిగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. సామర్లకోట రైల్వే ఓవర్ బ్రిడ్జి దిగువన పాత రిజిస్టర్ ఆఫీస్ సెంటర్లో స్కూల్ పిల్లలను ఎక్కించుకుంటున్న సందర్భంగా ఈ ఘటన జరిగింది. దాంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పిల్లలను వేరొక బస్సులో తరలించారు. పెద్దాపురం నుండి కాకినాడ వెళుతున్న స్కూల్ బస్సు పాత రిజిస్ట్రార్ కార్యాలయం సెంటర్ లో ఆగి విద్యార్థులను ఎక్కించు కుంటుండగా తెలంగాణ రాష్ట్ర గజ్వేల్ నుండి బియ్యం లోడుతో కాకినాడ పోర్టు కు వెళుతున్న లారీ ఆగివున్న స్కూల్ బస్సును వెనుకనుంచి ఢీ కొట్టింది. దానితో బస్సు వెనుకన ఉన్న అద్దాలు పగిలి బస్సు పాక్షికంగా దెబ్బతింది. బస్సులో ఇరవై మంది విద్యార్థులుండగా అదృష్టవశాత్తు వారికి ఎలాంటి గాయాలు కాలేదు. కాగా ఈ ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు అదుపులోనికి తీసుకుని ధర్యాప్తు చేస్తున్నారు.

## దొంగ పారిపోయిన ఘటన ఇద్దరు పోలీసుల సస్పెన్షన్

సూర్యాపేట,జూలై23 (ప్రజా మంటలు):
సూర్యాపేటజిల్లా గడేపల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, కానిస్టేబుల్ శ్రీనివాసులను సస్పెండ్ చేశారు. ఇటీవల గరిడేపల్లి పోలీస్ స్టేషన్లో బ్యాటరీల దొంగతనం చేస్తున్న వ్యక్తిని అదుపులో తీసుకొని పోలీస్ స్టేషన్లో ఉంచగా అతను పోలీసుల కన్నుగప్పి పారిపోయాడు. రెండు రోజులు అనంతరం అతను పోలీసులకు దొరికాడు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. కాగా, దొంగ పోలీస్ స్టేషన్ నుంచి పరారైన సమయంలో డ్యూటీలో ఉన్న వాచ్ కానిస్టేబుల్‌తో పాటు ఇతరులను హెడ్ కానిస్టేబుల్‌ను జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

## గద్వాల జిల్లాలో నేతన్న ఆత్మహత్య

జోగులాంబ గద్వాల,జూలై23 (ప్రజా మంటలు):
తెలంగాణలో పదేళ్ల తరువాత మళ్లీ నేతన్నల ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నాయని బిఆర్ఎస్ ఆరోపిస్తోంది. గత ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను, నేతన్నలకు ఆర్డర్లను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేస్తుండటం తో ఉపాధి లేక నేతన్నలు ఉరితాళ్లను ఆశ్రయిస్తున్నారు. తాజాగా జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో కాకే పరమేష్ (52) అనే చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుల బాధతో మనస్తాపానికి గురై ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని చేనేత కార్మికులు కోరుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో చేనేతకు అందించిన చేయూతను అర్ధాంతరంగా నిలిపివేయడంతోనే ఈ రంగం లో మరణమృదంగం మోగుతోందని నేతన్నలు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చీరాగానే వర్క్ ఆర్డర్లు నిలిపివేయడం, చేనేత కార్మికులకు ఎలాంటి ప్రోత్సాహం అందించకపోవడంతో వస్త్ర పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమగ్గాలు నడుపుతూ కుటుంబాన్ని పోషించు కునేవారు చేతిలో పనుల్లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడాల్సి వస్తున్నదని, కాంగ్రెస్ సర్కారు పరిపాల నా వైఫల్యం వల్లే ఈ సమస్యలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఎల్కతుర్తి బస్టాండ్ కూడలి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ఎస్ఐ రాజు కుమార్



ఎల్కతుర్తి జులై 23 (ప్రజామంటలు): ఎల్కతుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ఎల్కతుర్తి ఎస్సై గోదారి రాజు కుమార్ రోడ్డుపై తరచుగా ప్రమాదాలు జరుగుచుండగా వాహనాలు గుర్తు పట్టకుండా వెళుతున్నాయి కాబట్టి ఈ మధ్యకాలంలో వాహనా చోరీలు కూడా జరుగుచున్నాయి కావున సిసి కెమెరాలు ఉంటే సులభంగా దొరక పట్టవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కృష్ణమోహన్, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

# డీలర్ల ఖాళీల భర్తీకి చొరవ : కలెక్టర్‌తో చర్చించిన ఎమ్మెల్యే

కామారెడ్డి,జూలై23 (ప్రజా మంటలు):
రేషన్ షాపులకు డీలర్లు లేక పోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం బయోమెట్రిక్ సిస్టమ్ ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నారు. డీలర్‌కూడా బయోమెట్రిక్ పెట్టాలి. ఎవరి పేరిట షాపు ఉందో వారు బయోమెట్రిక్ చేస్తేనే ఆన్‌లైన్ ఓపెన్‌అవుతుంది. ఇన్‌చార్జి ఉన్న గ్రామాలతో పాటు, రెగ్యులర్‌గా ఉన్న గ్రామాల్లో ఒకే వ్యక్తి బయోమెట్రిక్ సిస్టమ్ ద్వారా బియ్యం పంపిణీకి ఆలస్యం అవుతోంది. ఇన్‌చార్జి ఉన్న షాపుల్లో 2, 3 రోజుల్లో బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఈ రోజుల్లో ఎవరైనా లబ్దిదారులు లేక పోతే రేషన్‌తీసుకునే విలులేదు. స్థానికంగా డీలర్ ఉంటే ఉదయం, సాయంత్రం లబ్దిదారులకు బియ్యం పంపిణీ చేస్తారు. ఇటీవల పలు గ్రామాల ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే రంగంలోకి దిగి ఖాళీల భర్తీకి పూనుకున్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజక వర్గాల్లో ఖాళీగా ఉన్న 42 రేషన్ షాపుల్లో డీలర్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. చాలా గ్రామాల్లో ఏళ్ల తరబడి ఈ సమస్య ఉండగా..లబ్దిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఇన్‌చార్జి డీలర్లతోనే నెట్టు కొస్తుండగా.. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ను కలిసి సమస్యను పరిష్కరించాలని సూచించారు. దీంతో పౌరసరఫరాల అధికారులతో మాట్లా డిన కలెక్టర్ ఖాళీగా ఉన్న రేషన్ షాపుల వివరాలను తెలుసుకొని వెంటనే భర్తీ చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం 489 మంది డీలర్లు ఉన్నారు. గతంలో నియమాకమయిన డీలర్ చనిపోవటం, కొందరు వివిధ కారణాలతో వదిలేయటం, అక్రమాలకు పాల్పడిన దృష్ట్యా కొందరిని గతంలో తొలగించటంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ఖాళీగా ఉన్న గ్రామాల్లో పక్క గ్రామ డీలర్లకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. కొన్ని షాపులకు 10 ఏళ్లుగా ఇన్‌చార్జి ఉంటున్నారు. స్థానికులు పలుమార్లు డీలర్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నప్పటికీ అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. కామారెడ్డి, ఎల్లారెడ్డి డివిజన్లలో 2 నియోజక వర్గాలు వస్తాయి. ఈ డివిజన్లలో ఖాళీగా ఉన్న 42 షాపుల డీలర్ల భర్తీ కోసం ఆర్డీవోలు నోటిఫికేషన్ జారీ చేశారు. కామారెడ్డి డివిజన్లో 34, ఎల్లారెడ్డి డివిజన్లో 8 షాపులకు నోటిఫికేషన్ ఇచ్చారు. గ్రామాల వారీగా రిజర్వేషన్లను కూడా ప్రకటించారు. భిక్కనూరు మండలంలో 5, దోమకొండలో 2, కామారెడ్డిలో 8, పాల్వంచలో 2, రాజంపేటలో 5, రామారెడ్డిలో 5, సదాశివనగర్‌లో 4, తాడ్వాయిలో 3, ఎల్లారెడ్డిలో 2, లింగంపేటలో 1, నాగిరెడ్డిపేటలో 5 షాపుల భర్తీకి నోటిఫికేషన్? ఇచ్చారు. ఆగస్టు నెలాఖరులోగా భర్తీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. బాన్సువాడ రెవిన్యూ డివిజన్ పరిధిలో ని జుక్కల్, బాన్సువాడలో 47 షాపుల్లో కూడా త్వరలోనే భర్తీ చేయనున్నారు.

# జగన్ ఢిల్లీ టూర్ వెనక రాజకీయ కోణం

## జాతీయ స్థాయిలో నిలబడేందుకు యత్నం

## ఊతకర్ర కోసం విపక్షాల వైపు చూపు



అమరావతి,జూలై23 (ప్రజా మంటలు): ఇంతకాలం ఎపిలో అరాచకాలు జరిగినా పట్టించుకోని జగన్, ఇప్పుడు పల్నాడులో ఓ హత్యతో ఢిల్లీలో తన గళం వినిపించాలని బయలుదేరారు. అయితే ఇందులో ఆయన తన రాజకీయ భవిష్యత్‌ను కూడా వెతుక్కుంటున్నారని అర్థం అవుతోంది. ఉన్న 11 సీట్లతో ఎపిలో ఇప్పటి కిప్పుడు చేసేదేమీ లేదు. ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను అధిగమించడం కూడా ఇప్పట్లో కష్టమే ఈ క్రమంలో జాతీయ రాజకీయాల్లో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలుస్తోంది. అలాగే వైసీపీ అధినేత జగగన్ ఇప్పుడు జాతీయ స్థాయిలో తనకు అండగా నిలబడే ఓ పార్టీ కోసం చూసుకుంటున్నారు. ఇప్పటి వరకూ ఆయన కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటిస్తూ వచ్చారు. కానీ ఇప్పుడు బీజేపీ టీడీపీ, జనసేనలతో కలిసిపోవడంతో తనను ఇబ్బంది పెడుతుందని తెలుసు. వివిధ కేసుల విషయంలో టిడిపి వదలబోదు. వచ్చే కొద్ది రోజుల్లో జగన్ పై కేసుల విచారణ ఊపందుకోవడం.. వివేకా హత్య కేసులోనూ కీలక పరిణామాలు చోటు చేసుకుంటాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. అలాగే తనపై కొత్త విచారణలు జరిగే అవకాశం ఉందని కూడా అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో జాతీయ పార్టీ అండ తనకు అవసరమని నమ్ముతున్నగా చెబుతున్నారు. ఇంతకాలం ఆయన బెయిల్‌పై ఉన్నారు. ఈ కేసుల్లో బెయిల్ ఉంటుందో కూడా తెలియదు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యేందుకు వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి గట్టి ప్రయత్నాలు చేస్తున్నారని ఢిల్లీ వర్గాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. పార్లమెంట్ సమావేశాలకు ముందు రాజ్ నాథ్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో వైసీపీ ప్రత్యేకహోదా కావాలని అడిగిందని జైరాం రమేష్ ప్రచారం చేశారు. హోదా కోసం వైసీపీ ప్రయత్నిస్తోందని చెప్పేందుకు ప్రయత్నించారు. వైసీపీకి ఆయన పబ్లిసిటీ చేసి పెట్టారు. మరో వైపు గతంలో రాహుల్ గాంధీని, కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తూ రాజ్యసభలో ప్రసంగించే విజయసాయిరెడ్డి ఇప్పుడు పల్లెత్తు మాట అనడం లేదు. కాంగ్రెస్ పార్టీని విమర్శించడం లేదు.. ఏపీలో షర్మిలను కాంగ్రెస్‌తో కలపకుండా.. ఆమె చంద్రబాబుతో కుమ్మక్కయ్యారని ఆరోపిస్తున్నారు. ఇక్కడే అసలు రాజకీయం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. జగన్ ఢిల్లీ పర్యటనకు ఎంచుకున్న అంశం జాతీయ రాజకీయాలకు సంబంధం లేనిది కానీ మోదీని కలుస్తానని జగన్ చెబుతున్నారు. కానీ తమ ఎన్డీఏ ప్రభుత్వం ఉన్న రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యపై కలుస్తానంటే మోదీ సమయం ఇవ్వడం కుదరదు. రాష్ట్రపతిని కలిసి ఫిర్యాదు ఇచ్చే అవకాశం ఉంది. జగన్ పై సీబీఐ కేసుల్లో విచారణలకు సమయం దగ్గర పడింది. వివేకా హత్య కేసులో సీబీఐ లోతుగా దర్యాప్తు చేస్తే.. ఆయన పేరు కూడా బయటకు వచ్చింది. తాజాగా ఇసుక, మద్యం స్కాముల్లో ఈడీ, సీబీఐ విచారణలకు రంగం సిద్ధమయిందని చెబుతున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో మొత్తం అవినీతిని బయట పెట్టి సీబీఐ, ఈడీకి రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసే అవకాశం ఉందని అంటున్నారు. ఈ కారణంగానే జగన్ తొందరపడుతున్నారని అంటున్నారు. ఢిల్లీలో కలసి వచ్చే పార్టీలని కలుపుకోవాలని జగన్ తన పార్టీ ఎంపీలకు చెప్పారు. జగన్ కు బీఆర్ఎస్ పార్టీ మద్దతు పలుకుతుంది. బీఆర్ఎస్ ను పక్కన పెడితే జాతీయ స్థాయిలో వైసీపీ దగ్గరకు వచ్చి మద్దతు పలికేవారు లేరు. జాతీయ రాజకీయాలకు జగన్ చాలా దూరంగా ఉంటూ వచ్చారు. ఈ కారణంగా ఆయనకు ఢిల్లీలో మిత్రులు లేరు. కానీ కలసి వచ్చే పార్టీల మద్దతు కోరుతామని అంటున్నారు. బహుశా ఇండియా కూటమిలోని పార్టీలే అని ఎక్కువమంది నమ్ముతున్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున ఎవరైనా ప్రతినిధి వచ్చి జగన్‌కు మద్దతు పలికే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. జగన్ కాంగ్రెస్ కు దగ్గర అయితే ఎక్కువగా నష్టపోయేది షర్మిలనే. అసలు ఏపీలో రాజకీయ హింస లేదని వారి పార్టీ నేతలే చంపుకున్నారని ఆమె తేల్చేశారు. జగన్ మోహన్ రెడ్డి ఢిల్లీలో చేయబోయే ధర్నాకు ఇండియా కూటమిపార్టీలు వచ్చి మద్దతిస్తే రాజకీయం సమూలంగా మారినట్లే అనుకోవచ్చు. బీజేపీకి ఆయన ఎదురెళ్లాలని డిసైడయ్యారని భావించవచ్చు. ఆ తర్వాతా ఆయన క్లిష్ట పరిస్థితుల్ని ఎదుర్కొనే అవకాశం ఉన్నా..తనకు సపోర్టుగా ఇతర పార్టీలు ఉంటాయని జగన్ ధైర్యంగా ఉన్నారని చెబుతున్నారు. మొత్తంగా జగన్ రాజకీయం ఇప్పుడు ఏదో వైపునకు మొగ్గాల్సిన పరిస్థితికి వచ్చిందని అనుకోవచ్చు. బిజెపితో కలవడానికి అవకాశం ఎలాగూ లేదు కనుక ..కొంత బలంగా ఉన్న విపక్ష కాంగ్రెస్‌తో కలవడం అనివార్యం కావచ్చు.

# సివిల్ వివాదాలకు దూరంగా ఉండండి

## పోలీసులుకు రాచకొండ కమిషనర్ సూచన

హైదరాబాద్, (ప్రజా మంటలు): సివిల్ వివాదాలకు పోలీసులు దూరంగా ఉండాలని రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు సూచించారు. నేరేడ్‌మెట్‌లోని కమిషనరేట్‌లో నిర్వహించిన డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్ల ప్రత్యేక సమీక్ష సమావేశంలో సీపీ మాట్లాడారు. నేరాల నియంత్రణ, నేరస్థులను పట్టుకోవడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని, సీసీటీవీ ఫుటేజీలను వినియోగించుకోవాలన్నారు. పాత నేరస్థుల కదలికపై నిఘా ఉంచాలని, స్టేషన్‌కొచ్చే వారితో మర్యాదతో మసలుకోవాలని హితవుపలికారు. మహిళలు, చిన్నారుల పట్ల నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా ఉండాలని.. డ్రగ్స్ సరఫరా, విక్రయంపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. డీసీపీలు రాజే చంద్ర, ప్రవీణ్ కుమార్, కరుణాకర్, అరవింద్ బాబు, సునీతారెడ్డి, ఉషా విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

హైదరాబాద్, (ప్రజా మంటలు): బస్సులు, లారీలు, రైళ్ల ద్వారా నగరానికి మత్తు పదార్థాలు తరలించి విక్రయిస్తున్న ఇద్దరిని ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ, జవహర్‌నగర్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. ఎస్‌వోటీ డీసీపీ మురళీధర్‌తో కలిసి కేసు వివరాలను సీపీ వెల్లడించారు. రాజస్థాన్ జోథ్‌పూర్‌కు చెందిన పెయింటర్ ఓమా రామ్ అలియాస్ ఓం ప్రకాష్ (35) నల్లమందు, పాపిస్టా పౌడర్ విక్రయించేవాడు. అదే రాష్ట్రానికి చెందిన సన్వాల రామ్ (33) చందానగర్‌లో ఉంటూ రోలింగ్ షట్టర్ల కార్మికుడిగా పనిచేస్తున్నాడు,. ఇద్దరూ కలిసి సులభంగా డబ్బులు సంపాదించే లక్ష్యంతో డ్రగ్స్ వ్యాపారి వికాస్ అలియాస్ ముఖేష్ నుంచి పాపిస్టా పౌడర్, ఎండీఎంఏ కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్నారు. నిఘా ఉంచిన పోలీసులు.. జవహర్‌నగర్ పరిధిలోని తిమ్మాయిపల్లి శివారులో డ్రగ్స్ తరలిస్తుండగా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 40 కిలోల పాపిస్టా పౌడర్ (గసగసాల పొడి), 10 గ్రాముల ఎండీఎంఏ, 3 మొబైల్ ఫోన్లు, రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన సరఫరాదారుడు వికాస్ పరారీలో ఉన్నాడు

# ప్రైవేట్ హాస్టల్‌లో గంజాయి స్వాధీనం

## ఆరుగురు ఇంజనీరింగ్ విద్యార్థుల విచారణ



హైదరాబాద్, (ప్రజా మంటలు): ఈ మధ్యకాలంలో రాష్ట్రంలో చాలా చోట్ల మాదకద్రవ్యలకు సంబంధించిన అనేక విషయాలను మనం చూస్తూనే ఉన్నాము. ఇకపోతే ఈ మధ్యకాలంలో మత్తు పదార్థాలను కొందరు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులకు విక్రయిస్తూ వారి జీవితాలను సూన్యంలోకి నెట్టేస్తున్నారు. నగరంలో దాదాపు 100కు పైగా ప్రైవేట్ హాస్టల్స్ కొనసాగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. టీస్టాల్ వద్ద గంజాయి అమ్ముతున్నట్లుగా మాకు తెలిసిందని ఏసిపి కెవిపి రాజు తెలిపారు. ఇప్పటికే ప్రైవేట్ హాస్టల్లో రైడ్ చేశామని., గల్లికొక్కటిగా పుట్టుకొస్తున్న ప్రైవేట్ హాస్టల్లో ఇలాంటి కార్యక్రమాలు సాగుతున్నట్లు ఆయన అన్నారు. ఇకపోతే ఇబ్రహీం పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ప్రవేట్ హాస్టల్ లో విద్యార్థుల వద్ద గంజాయిని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. వివిధ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న 6 మంది విద్యార్థులను పట్టు కొని పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. చిన్న చిన్న ప్యాకెట్లు చేసి విక్రయిస్తున్న టీ షాప్ యజమానులకు ఇది ఎక్కడ నుండి వస్తుందని త్వరలో గుర్తిస్తామని ఇబ్రహీంపట్నం ఏసిపి కెవిపి రాజు తెలిపారు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# స్వాతంత్ర్యంతో పాటు స్వయం సమృద్ధి

## పోరాటాన్ని కొత్త పుంతలు తొక్కించిన తిలక్

ముంబై,జూలై23 (ప్రజా మంటలు): స్వాతంత్ర పోరాటాన్ని కొత్త పుంతలు తొక్కించిన స్ఫూర్తి ప్రదాత లోకమాన్య బాగంగాధర్ తిలక్.. . 1856, జులై 23 మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాలో జన్మించారు. గాంధీజీ దృష్టిలో ఆయన 'ఆధునిక భారత నిర్మాత! నెహ్రూకాయన – 'భారత విప్లవ పిత!' అహింసతో మహాత్ముడు బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడిస్తే... 'ఆలోచన'తో భారతీయులను తట్టిలేపి, తెల్లవారి గుండెల్లో కల్లోలం సృష్టించి... భారతావని నుదిటిన స్వరాజ్య 'హక్కు' తిలకం దిద్దిన బుద్ధిజీవి... బాల గంగాధర్ తిలక్! మనం ఈరోజు వింటున్న ఆత్మనిర్భర్, మేకిన్ ఇండియాను వందేళ్ల కిందటే ఆకాంక్షించిన ఆ దార్శనికుడి జయంతి నేడు! అలనాటి పోరాట యోధుడికి ఓ నివాళి!ఒక్కటి కాదు... ఆయనో తత్వవేత్త, గణితవేత్త, జర్నలిస్టు, రచయిత.. ఉద్యమకారుడు. తిలక్ దృష్టిలో స్వరాజ్యమంటే కేవలం రాజకీయ స్వాతంత్ర్యం ఒక్కటే కాదు. సాంస్కృతిక, ఆర్థిక స్వాతంత్ర్యం కూడా! సంస్కృతి, విద్య, మీడియా... మూడింటినీ మార్గాలుగా చేసుకొని ప్రజల్ని చైతన్యవంతులను చేయటానికి, భారత జాతీయ అస్థిత్వాన్ని పాదుకొల్ప టానికి కృషి చేశారు తిలక్. ఆత్మనిర్భర్ భారత్... నైపుణ్య భారత్, మేకిన్ ఇండియా...అంటూ ఇప్పుడు మనం ప్రతిరోజూ వినే ఈ పదాల్ని వందేళ్ళ కిందటే మంత్రించారు తిలక్! తన స్వదేశీ అర్థం కేవలం విదేశీ వస్తువులను బాయ్‌కాట్ చేయటమే కాదు... దేశీయంగా మనవాళ్ళు పారిశ్రామికవేత్తలుగా మారాలని, భారత్‌లో తయారీ రంగం విస్తరించాలని కోరుకునేవారు. ఆయనిచ్చిన ఈ స్ఫూర్తితోనే ఈశ్వర్‌దాస్ వర్ష్ణెళి పుణె దగ్గర గ్లాస్‌వర్క్ఫ్యాక్టరీ ఆరంభించారు. ముంబైలో జంషెడ్‌జీ టాటాతో కలసి తిలక్ బొంబాయి స్వదేశీ సహకార స్టోర్స్ కంపెనీ మొదలెట్టారు. భారత్‌లో తయారయ్యే వస్తువులను ప్రోత్సహించటం ఈ కంపెనీ ప్రధాన కర్తవ్యం. ట్యుటికోరిన్‌లో చిదంబరం పిళ్ళై షిప్పింగ్ కంపెనీ తెరిచారు. బ్రిటిష్ ఇండియా స్టీమ్ నావిగేషన్ కంపెనీకి అది తీవ్రమైన పోటీనిచ్చింది. చివరకు... మాండలే జైలులో ఉన్నప్పుడు రాసిన గీతారహస్య పుస్తకం అచ్చువేసేందుకు భారత్‌లో తయారైన కాగితాన్నే వాడాలని పట్టుబట్టారు. స్వాతంత్ర్యోద్యమం లో ఆయన వినాయక ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించి స్వాతంత్ర్యోద్యమ కాంక్షను రగిలించారు.

# ఎల్కతుర్తిలో అరుదైన ప్రాచీన శిల్ప సంపద లభ్యం

- భూమిలో కూరుకుపోయిన సూర్యభగవానుడి శిల్పం
- కళ్యాణి చాళుక్యుల కాలం నాటివిగా గుర్తింపు
- విగ్రహాల పునః ప్రతిష్ట చేయాలని ముక్తకంఠంతో కోరుతున్న భక్తులు

ప్రజామంటలు రిపోర్టర్ కందుకూరి రాజన్న











ఎల్కతుర్తి జూలై 23 (ప్రజామంటలు) : ఎల్కతుర్తి మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో కనకదుర్గ ఆలయం ఉంది. ఆలయంలో నిలువెత్తు పుట్ట ఉంది. కనకదుర్గ దేవతగా భావించి ప్రతిఏటా ఆషాడం, శ్రావణమాసాల్లో వంటలకు వెళ్తారు. ఈ పక్కనే డంపింగ్ యార్డ్ ఉంది. ఈ రెండింటి మధ్యలో భూమిలో కూరుకు పోయిన సూర్య భగవానుడి విగ్రహం, చాముండి(పోచమ్మ), వినాయకుడు, నంది, హనుమాన్ విగ్రహాలు ఉన్నాయి. ఆదిత్యు(సూర్య)ని శిల్పం...కిరీటమకుటం, హార, గ్రైవేయకాలు, చెవులకు జూకాలు, కర కంకణాదులు, రెండు చేతుల్లో రెండు తామరమొగ్గలు, సమపాద స్థానకభంగిమ కలిగిన అరుదైన ప్రాచీన విగ్రహ శిల్ప సంపద కళ్యాణీ చాళుక్యుల కాలం నాటివని, దాదాపు 10,11వ, శతాబ్దాల కాలం నాటివని కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ నిర్ధారించారు. పొట్టికొమ్ములు, ముఖపట్టకంతో, రిక్కించిన చెవులు, మెడకు కట్టిన రెండు వరుసల పూసల దండలు, ఎత్తైన మూపురం, నడుం మీద కీర్తి ముఖంతో ముందుకు మెడ కిందకు, వెనక తోక కిందివైపు వేసిన చిరుగంటల పట్టెడలతో కూర్చుని ఉన్న నంది విగ్రహం చక్కని శిల్ప నైపుణ్యంతో ఉన్నది. వీటి గూర్చి గ్రామస్తులను విచారించగా, గ్రామంలోని శివాలయంలో ధ్వజస్తంభం ప్రతిష్టాపనలో భాగంగా, పాత విగ్రహాలను తీసి ఇక్కడ పడవేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఏది ఏమైనా అద్భుత శిల్ప నైపుణ్యం కలిగిన విగ్రహాలను పునః ప్రతిష్ఠించాలని భక్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# చెరువు మత్తడిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్



జగిత్యాల జులై 23 (ప్రజామంటలు): మోతే చెరువు నీటి మత్తడిని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పరిశీలించి, వరద ప్రభావం వల్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మోతే చెరువు యొక్క మరమ్మత్తులు గవర్నమెంట్ కు మూడు కోట్ల రూపాయలు అవసరమని ప్రతిపాదనలు పంపామని తెలిపారు. జిల్లాలో 452 మిల్లి మీటర్ల వర్షపాతం సాధారణంగా అయితే 380 శాతం వర్షం అయితే సాధారణంగా కంటే ఎక్కువ పడడం వల్ల వరద ప్రభావం ఉందని అన్నారు. మోతే చెరువుకు సంబంధించి 149 టీఎంసీల తక్కువ,సామర్థ్యం ఉందని ఇప్పటివరకు అయితే ఇబ్బంది ఏమి లేదని అన్నారు. అనంతరం, కండ్ల పెల్లి చెరువు కూడా పరిశీలించారు. నీటి మట్టం చెరువు యొక్క స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.... జిల్లాకు మరో 3 రోజుల వర్షాలు ఉన్న నేపథ్యంలో అధికారులు అందుబాటులో ఉండాలి కోరారు. ఈ కార్యక్రమములో ఆర్డీవో మధు సూధన్, మున్సిపల్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి బరిలో చిటుకూరి అనిల్



భీమదేవరపల్లి జూలై 23 (ప్రజామంటలు): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుని రేసులో అభ్యర్థులు బరిలో నిలిచారు. సోమవారం నాటికి నామినేషన్లు పూర్తయ్యాయి. అధ్యక్ష పదవి కి ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. ఎవరికైతే ఆన్లైన్లో ఎక్కువ ఓటింగ్ వస్తుందో వారే యూత్ కాంగ్రెస్ అధ్యక్ష రేసులో మూడు సంవత్సరాలు కొనసాగుతారు. మండల కేంద్రానికి చెందిన చిటుకూరి అనిల్, గుడికందుల రాజు, జక్కుల అనిల్, ఆదరి రాజేందర్, దేవరాజు , అజయ్ బరిలో ఉన్నారు. చిటుకూరి అనిల్ గత 10 సంవత్సరాలు గా కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం పనిచేశారు. 2009 లో మాజీ ఎమ్మెల్యే అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డి గెలుపులో, పొన్నం ప్రభాకర్ ఎంపీ గెలుపు లో కార్యకర్తలను సమన్వయం చేసి తన వంతు కృషి చేశారు. గత పంచాయతి ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ తరుపున బరిలో ఉన్న వారి గెలుపుకు తన వంతు పాత్ర వహించాడు. పూర్వం మండలం లో పార్టీ కార్యకర్తల మధ్య సఖ్యత లోపించడంతో అందరిని సమన్వయం చేసి గత అసెంబ్లీ ఎన్నికల్లో పొన్నం ప్రభాకర్ గెలుపులో అహర్నిశలు కష్టపడ్డాడు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TEL-TEL01938. FILE NO.1349985 PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com